

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 26.0

పీఎంజీపీ యూనిట్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి : కలెక్టర్

ఏలూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం కింద మంజూరైన యూనిట్ల స్థాపనకు సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు పీఎంఈజీపీ కింద మంజూరైన ఉపాధి యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రోత్సహించే దిశగా జిల్లాలో కనీసం 30 స్వయం సహాయక గ్రూపులతో యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరులోని కార్పెట్ క్లస్టర్ ఏర్పాటులో భాగంగా భూమికి సంబంధించిన అంశాలు పూర్తయినందున, విద్యుత్, ఎన్‌వోసీ విషయాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సింగిల్ విండో పథకం దరఖాస్తు చేసుకున్న 33 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్లో 23 మంది పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ సమావేశంలో ఆమోదం తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి పాలసీని అనుసరించి 14 పరిశ్రమలకు రూ.కోటి 25 లక్షలు ప్రోత్సాహకాలను మంజూరు చేశారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద మే నెలలో 2,59,685 మంది ఫించన్‌దారులకు రూ.112.98 కోట్లు పంపిణీని సమర్థవంతంగా చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మే 1వ తేదీ ఉదయం 7 గంటలకు పంపిణీ సిబ్బంది 5,292 మంది పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఏదైనా కారణాల వల్ల తీసుకోని వారికి మే 2వ తేదీన పంపిణీ చేస్తారన్నారు.

అమరావతికి రారండోయ్



రేపే ప్రధాని మోదీ సభ.. ఉమ్మడి పశ్చిమ నుంచి లక్షలాది మంది హాజరు.. నియోజకవర్గాల వారీగా ఏర్పాట్లు

- వందలాది ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు సిద్ధం
- మహిళా సంఘాలు.. యువతరానిది అదే దారి
- ఏర్పాట్లపై మంత్రులు బిజీబిజీ
- కలెక్టర్, ఎస్పీలు నిరంతర సమీక్షలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాజధాని అమరావతి శంకుస్థాపనకు ప్రధాని మోదీ హాజరవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు కూటమి శ్రేణులు నాయకత్వాన్ని అప్రమత్తం చేస్తున్నారు. సభకు వెళ్లి రావడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా మహిళా సంఘాలు పెద్ద ఎత్తున అమరావతి తరలివెళ్లేందుకు ఇప్పటికే ఉత్సాహంతో ఉన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీలు తమ క్యాడర్‌తో ఇప్పటికే ప్రత్యేక భేటీలు చేశాయి. ఏలూరు జిల్లాపరంగా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లావ్యాప్తంగా ముఖ్యులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పశ్చిమలోను ఇదే తరహా ఏర్పాట్లు జరిగాయి. నియోజకవర్గాల వారీగా సమీకరణలు ఇప్పటికే లెక్క తేలినందున ఆ మేరకు క్రమశిక్షణతో అమరావతి సభకు తరలి వెళ్లేలా సీనియర్లంతా నియోజకవర్గ నేతలకు నిర్దేశం చేశారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథితో పాటు సీనియర్లంతా అమరావతి సభకు వెళ్లేవారి విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో ఆరా తీస్తున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రం కిషోర్, అయనంపూడి శ్రీదేవితోపాటు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనచౌదరి వంటి వారంతా ప్రజా సమీకరణలో తలమునకలయ్యారు. అధికారికంగా ఈ కార్యక్రమం జరుగుతున్నా

ప్రజా రాజధాని అమరావతి. దీని శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం హాజరు కానున్నారు. ఇక్కడ జరిగే సభకు ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి రెండు లక్షల మందికి పైగా తరలి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. వేసవి ఎండలు మండిపోతున్నందున తగ్గట్టుగానే అటు కూటమి నాయకత్వం, ఇటు అధికార యంత్రాంగం ప్రజా సమీకరణలో జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

పార్టీ పరంగా వివిధ వర్గాలను అమరావతికి తరలివెళ్లేలా జాగ్రత్త వహిస్తున్నారు. బహిరంగ సభ జరగబోయే వివిధ రహదారుల్లోనూ తాగునీటితోపాటు మజ్జిగను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భారీ ఎత్తున వాహనాలు సిద్ధం

అమరావతి సభకు వెళ్లే వారి నిమిత్తం యంత్రాంగం పెద్ద ఎత్తున వాహనాలను సిద్ధం చేస్తోంది. ఏలూరు నుంచి 120, పశ్చిమ నుంచి మరో 120 ఆర్టీసీ బస్సులను కేటాయించింది. తొలుత ఈ బస్సులను గుంటూరులో అందుబాటులో ఉంచుతారు. స్థానిక జిల్లాలకు సంబంధించి ప్రజలు తరలి వెళ్లేందుకు వీలుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి దాదాపు 800కు పైగా బస్సులను అందుబాటులో ఉంచారు. వ్యక్తిగతంగా మరో వెయ్యికిపైగా వాహనాల్లో తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యువతరం ద్విచక్ర వాహనాలపై వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రెండు జిల్లాల నుంచి లక్షన్నరకు మందికిపైగా అమరావతి సభకు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా. కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి దఫదఫాలుగా సమీక్షించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బందిని ఇప్పటికే సభ జరిగే ప్రాంతానికి పారిశుధ్య ఏర్పాట్లు, ఇతరత్రా అవసరాల నిమిత్తం పాల్గొనేందుకు తరలించారు.

ఎక్కడ చూసినా అమరావతి భూమ్

మహిళా గ్రూపులు, వివిధ పార్టీల కార్యకర్తలు, నేతలు సాధ్యమైనంత మేర శుక్రవారం ఉదయాన్నే అమరావతి తరలివెళ్లేలా సన్నాహాలు చేసుకుంటున్నారు. పోలీస్ యంత్రాంగం హైవేలన్నింటిలోను సిబ్బందిని అప్రమత్తం చేసింది. జిల్లాల ఎస్పీలు కేవీపీఎస్ కిశోర్, అద్నాన్ నయీం అస్మి, ఐజీ అశోక్‌కుమార్ తాజా పరిస్థితిని సమీక్షించారు. సభకు వెళ్లి తిరిగి గమ్యస్థానాలకు చేరుకునేంత వరకు అప్రమత్తంగా వ్యవహరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూటమి భాగస్వామ్య పార్టీలన్నీ తమ క్యాడర్‌ను పూర్తిగా అప్రమత్తం చేశాయి. దీంతో గడిచిన మూడు రోజులుగా అటు యంత్రాంగం, ఇటు పార్టీల నాయకత్వాలు అమరావతి బహిరంగ సభపైనే దృష్టిపెట్టాయి.

కలెక్టర్ సమీక్ష

ప్రధాని సభకు ఏలూరు జిల్లా నలుమూలలు నుంచి ప్రజలు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయా లని అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆమె సంబంధితశాఖ అధికారులతో ఏర్పాట్లను టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.



ఉప ఎన్నికల కోసం..

నేను చనిపోవాలని కోరుకుంటున్నారు

'నేను ఎప్పుడు చనిపోతానో తెలియదు. కాని, నేను ఇప్పటికిప్పుడు చనిపోతే ఇక్కడ ఉప ఎన్నికలు వస్తాయని నాతో తిరిగే కొందరు భావిస్తున్నారు. టిక్కెట్ ఆశించేవారు నేను చనిపోయిన తర్వాత ఎమ్మెల్యే కావాలని కోరుకుంటున్నారు' అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మెయిన్‌లో..



సీఆర్‌రెడ్డి కాలేజి వద్ద విద్యార్థులను పరిశీలించి పంపుతున్న సిబ్బంది

86.13 శాతం హాజరు

- ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష .. వారంలోగా ఫలితాలు!

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం నిర్వహించిన పాలిసెట్-2025 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఏలూరులోని 10 కేంద్రాలు, నూజివీడులోని 2 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 4,312 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 3,714 మంది (86.13శాతం) హాజరయ్యారు. ఏలూరు కేంద్రాల్లో పరీక్షకు బాలురు 1,924 మంది, బాలికలు 1,091 మంది, నూజివీడు కేంద్రాల్లో బాలురు 452 మంది, బాలికలు 247 మంది హాజరైనట్టు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాల బండిళ్లను మూల్యాంకనం నిమిత్తం గుంటూరుకు సాయుధ పోలీసు బందోబస్తు నడుమ వాహనాల్లో తరలించారు. గరిష్ఠంగా వారం రోజుల్లో ఫలితాలు వెల్లడయ్యే అవకాశంఉంది. కౌన్సెలింగ్ ప్రక్రియ మే 20 నుంచి ప్రారంభం కావొచ్చని అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాలో పాలిసెట్ నిర్వహణను ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య బోర్డు కార్యదర్శి జి.వి.రామచంద్రరావు, కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శంకరరావు, ఏపీటీ సెంటర్ ప్రిన్సిపాల్ ఎం.దాసు, సిటీ కో-ఆర్డినేటర్ సీహెచ్.సతీష్, తదితరులు పర్యవేక్షించారు.

చేదెక్కిన మధుర ఫలం

- దిగుబడి లేదు.. మార్కెట్టూ లేదు
- ధరల పతనంతో కుదేలైన మామిడి రైతు
- అక్కరకు రాని పంటల బీమా
- తోటలను తొలగిస్తున్న రైతులు

(నూజివీడు టౌన్)

మధురఫలం మామిడి.. పండించే రైతుకు చేదునే మిగులుస్తోంది. ఏటా ఈసారి కలిసి వస్తుందని భావిస్తున్న రైతులకు అననుకూల వాతావరణ పరిస్థితు లు, దళారీల ప్రభావంతో నిరాశే మిగులుతోంది. ప్రస్తుత సీజన్‌లో అననుకూల వాతావరణ పరిస్థితులు, చీడ పీడల ఉధృతితో మామిడి దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఉమ్మడి కృష్ణా జిల్లా



మార్కెట్లో అమ్మకానికి మామిడి కాయలు

పరిధిలోని నూజివీడు డివిజన్, ప్రస్తుత ఏలూరు జిల్లా పరిధిలోని నూజివీడు డివిజన్‌లలో దాదాపు 60 వేల హెక్టార్‌లలో మామిడి సాగులో ఉంది. అయితే ప్రతి సీజన్‌లో వస్తున్న దిగు బడితో పోల్చితే ప్రస్తుతం 30 శాతానికి మించి దిగుబడి లేదని ఉద్యాన వనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ధర బాగుంటుందని ఆశించిన రైతులకు దళారుల ప్రభావంతో మామిడి చేదునే మిగులుస్తోంది.

పతనమవుతున్న ధరలు

మామిడి సీజన్ ప్రారంభమైన ఫిబ్రవరిలో బంగినపల్లి రూ.లక్షన్నర పైనే(టన్ను) ధర పలికింది. అయితే క్రమేణ ధర పతనమవుతూ వచ్చింది. ప్రస్తుతం బంగినపల్లి రూ.20 వేల నుంచి రూ.40 వేల మధ్య ధర పలుకుతోంది. మరో ప్రధానమైన మామిడి రకమైన తోతాపురి (కలెక్టర్) రకం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ప్రస్తుతం టన్ను కలె క్టర్ ధర రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు పలుకుతోంది.

ప్రైవేట్ మార్కెట్లే దిక్కు

ప్రస్తుత సీజన్‌లో మామిడి దిగుబడి పతనమవ్వడంతో ఏ రైతు జాతీయ మామిడి మార్కెట్‌కు కాయలను తరలించే పరిస్థితి లేదు. ప్రతి తోటలోనూ పట్టుమని పది టన్నులు కాయతెగే పరిస్థితి లేకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ మార్కెట్లపై రైతులు ఆధారపడాల్సి వస్తోంది. స్థానిక కమిషన్ దుకాణాల్లోను మార్కెట్ తక్కువగా ఉండడంతో రైతులు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. నూజివీడు పరిసర ప్రాంతాల్లోని ఈదరతో పాటు నున్న, రెడ్డిగూడెం, విస్సన్నపేట, కొండపర్వల్లో స్థానిక మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ బంగినపల్లి రూ.20 వేల నుంచి రూ.30 వేల మధ్య ధర పలుకుతోంది. కలెక్టర్ రకం అయితే రూ. ఆరు వేల నుంచి రూ.పదివేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. రైతులకు అయ్యే ఖర్చుకు వారికి దక్కుతున్న ధరకు పొంతన ఉండడం లేదు.


అక్కరకు రాని పంటల బీమా

రాష్ట్రప్రభుత్వం మామిడి రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రస్తుత సీజన్‌లో మామిడి రైతుకు అంతగా ఉపయోగపడ లేదు. ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతు సేవా కేంద్రాల ద్వారా బీమాను కట్టించాల్సిన అధికారులు ఆ పని చేయడంలో విఫలం చెందడంతో ప్రస్తుతం దెబ్బతిన్న రైతులకు పంటల బీమా ఉప యోగ పడని పరిస్థితి నెలకొంది. మరోవైపు కలిసి రాని మామిడిని వదిలించుకునే పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేస్తున్నారు. తోటలను కలప కింద నరికించి విక్రయిస్తున్నారు.



ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట శివారు మామిడితోటలో మామిడి కాయలు కోస్తున్న రైతు

ఆవకాయ మంట



- ఒక్కో పచ్చడి మామిడి కాయ రూ.15 నుంచి రూ.40పై మాటే
- మండుతున్న నూనె, మిరప, ఇతర దినుసులు
- లబోదిబోమంటున్న పచ్చడి ప్రియులు

ద్వారకాతిరుమల : పచ్చడి మామిడి కాయల ధర గుబులు పుట్టిస్తోంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడు మామిడి కాపు తగ్గడంతో ధర చుక్కలనంటింది. పచ్చడి మామిడికాయలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు హడలిపోతున్నారు. ఈ ఏడాది జనవరిలో పడ్డ వర్షాలకారణంగా పూత రావడం బాగా ఆలస్యమైంది. సాధారణంగా పచ్చళ్లకు దేశవాళీ, కొత్తపల్లి కొబ్బరి. చిన్నరసాలు, తెల్లగులాబీ, సువర్ణరేఖ, హైదర్ సాహెబ్ వంటి రకాల కాయలను వినియోగిస్తారు. సైజును, రకాన్ని బట్టి ఒక్కో కాయ రూ.15 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోందని వినియోగదారులు చెబుతున్నారు. మరోవైపు మామిడికాయలతో పాటుగా మిరప, నూనె, ఆవాల ధరలు సైతం మండిపోతున్నాయి. నూనె కేజీ రూ.200, కాగా నువ్వుల నూనె కేజీ రూ.420 వరకు మిల్లు వద్ద విక్రయిస్తున్నారు. మొదటిరకం మిర్చి కారం కేజీ రూ.500 నుంచి రూ.600 వరకు ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఆవాలు కేజీ రూ.120 వరకు ఉండడంతో వినియోగదారులు హడలిపోతున్నారు. పచ్చళ్లు పాడవకుండా నిల్వ చేసే పింగాణి జాడీలు సైతం మంచి ధర పలుకుతున్నాయి. ఈ క్రమంలో 12 లీటర్ల జాడీ రూ.1,100, 10 లీటర్ల జాడీ రూ.900 వరకు సైజును బట్టి విక్రయిస్తున్నారు.

మంచినీటి సమస్యలు పరిష్కరించండి!



- కొన్ని ప్రాంతాల్లో బురద నీరే తాగాల్సిన దుస్థితి
- మరమ్మతులకు గురైన బోర్లు
- సక్రమంగా సరఫరా కాని సత్యసాయి పథకం నీళ్లు
- వేలేరుపాడు మండలంలో మంచినీళ్ల కోసం పాట్లు
- సమస్యలను విన్నవించిన ప్రజలు

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వేసవి కావడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. మంచినీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనంగా మంచి నీటి వనరులు (రక్షిత మంచినీటి పథకాలు) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో వరదలకు పెదవాగు కట్ట తెగిపోవడంతో ఇప్పటికీ వేలేరుపాడు మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఇప్పటికీ మంచినీటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. నీరు ఫిల్టర్ కాకపోవడం వల్ల కొన్ని ప్రాంతాలలో బురద నీరు వస్తోందని, గ్రామాల్లో నెలకొన్న మంచినీటి సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏలూరు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాయలంలో ఎస్ఈ జి.త్రినాథ్ బాబుతో నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్' కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు కోరారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడతామని ఎస్ఈ పేర్కొన్నారు.

వేసవి మంచినీటి ప్రణాళిక సిద్ధం

వేసవిలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ఉండడానికి వేసవి మంచినీటి ప్రణాళికను రూపొందించాం. గత జనవరిలోనే ఈ ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. జిల్లాలోని 121 గ్రామాల్లో మంచినీటి సమస్య లుంటాయని గుర్తించి రూ. 45.41 లక్షలతో ఈ ప్రణాళిక రూపొందించాం. 29 గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్నాయని, అవసరమైన సమయంలో ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని తరలించడానికి రూ.20.76 లక్షలు ఖర్చు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంచినీటి బోర్లులో నీరు ఇంకిపోయి ఇబ్బందులు ఏర్పడితే ఆయా ప్రాంతాల్లో మంచి నీటి వనరులు (బోర్లు) అద్దెకు తీసుకుని తద్వారా ఆయా గ్రామాల్లో మంచినీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. 14 గ్రామాల్లో ఇటువంటి సమస్య ఏర్పడే అవకాశాలున్నాయని, అద్దెకు వనరులు వినియోగిం చుకోవడానికి రూ.2.80 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా వేశాం. జిల్లాలో 74 బోర్లలో పూడిక తీయడానికి రూ.9.25 లక్షలు, 12 బోర్లు లోతు చేయడానికి రూ.3.60 లక్షలు, ట్యాంకర్లలో వాటర్ నింపడానికి రెండు గ్రామాలకు రూ.9 లక్షలు మొత్తం కలిపి రూ.45.41 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా వేశాం. గ్రామాల్లో తాగునీటి పథకాలు, ఇతర మంచినీటి వనరులు మరమ్మతులకు 15వ ఆర్థిక సంఘ నిధులు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించారు. జిల్లాలోని పంచాయతీలకు సంబంధించి రూ.5 కోట్లు, మండల పరిషత్‌లకు సంబంధించి రూ.2.70 కోట్లు కేటాయించారు.

- జి.త్రినాథ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈ

- మా ప్రాంతంలో నిన్నటి నుంచి మంచినీరు సరఫరా కావడం లేదు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించి మంచినీటి సరఫరా చేయాలి.

- అనూష, దుగ్గిరాల, పెదవేగి మండలం.

ఎస్ఈ : ఆ ప్రాంతంలో బుధవారం సాయంత్రానికి మోటార్ పునరుద్ధరణ చేస్తారు. గురువారం యథావిధిగా మంచినీరు సరఫరా జరుగుతుంది.

- చాటపర్రు గ్రామంలోని పెదచెరువు నీరు నింపాల్సి ఉంది. కోటేశ్వరదుర్గాపురంలో మంచినీటి చెరువుకు నీరు నింపకుండా చేపల చెరువులకు నీరు పెట్టుకుంటున్నారు. పరిశీలించండి.

- బండి వెంకటేశ్వరరావు, ఏలూరు

ఎస్ఈ : చెరువులో నీరు నింపుతున్నారు. చేపల చెరువులకు నీళ్ల మళ్లింపు విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- మా గ్రామంలో సమ్మర్ ట్యాంక్ ద్వారా డైరెక్ట్ పంపింగ్ జరుగుతూ ఉంటుంది. వేసవిలో భూగర్భ జలాలు తగ్గడం వల్ల కొన్ని రోజులుగా నీరు సరఫరా కావడం లేదు. అలాగే శ్రీధర గ్రామంలో ఎస్సీ కాలనీలో బోరు , మోటార్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

- టి.సీతారాములు, శ్రీధర వేలేరు, కుక్కునూరు మండలం

ఎస్ఈ : ఈ సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- మంచినీరు బురదగా వస్తోంది. వాటర్ ఫిల్టర్ కావడం లేదు. మంచినీరు అందించాలి

- షేక్ రహీమ్‌బాషా, కైకలూరు

ఎస్ఈ : ఆ ప్రాంతాన్ని పరిశీలించడానికి మా సిబ్బందిని

- మిగతా 8లో

పెదవాగు వరద.. దెబ్బతిన్న బోర్లు, ఫిల్టర్ బెడ్స్

- గత వర్షాకాలంలో పెదవాగుకు సంబంధించి గుమ్మడివల్లి ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ఈ ప్రాంతంలో బోర్లు దెబ్బతిన్నాయి, ఫిల్టర్ బెడ్స్ దెబ్బతిన్నాయి. దీంతో అప్పటి నుంచి ఇప్పటివరకు మంచినీటి సమస్యలు తీరడం లేదు. ఎమ్మెల్యేగారికి, అధికారులకు ఈ సమస్యను ఎన్నోసార్లు విన్నవించాం. రామవరం, మేడిపల్లి గ్రామాల్లో మంచినీటి సమస్యలు ఏర్పడ్డాయి. మేడిపల్లి పంచాయతీ పరిధిలోని బుల్లాయి గ్రామానికి రక్షితమంచినీటి పథకం కావాల్సి ఉంది. కుమ్మరగూడెంలో చేతిపంపులు కావాలి.

- ఆదినారాయణ/కామినేని వెంకటేశ్వరరావు, వేలేరుపాడు,
- జి.రాంబాబు, మేడిపల్లి

ఎస్ఈ : పెదవాగు కారణంగా ఆయా ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసు కుంటున్నాం. ఫిల్టర్ పాయింట్లు కొట్టుకుపోవడంతో ఆ సమస్యను పరిష్కరించడానికి, బోర్లు డ్రిల్లింగ్ చేయడానికి జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపించాం. పెదవాగు కారణంగా మంచినీటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో జడ్పీ నిధులు కేటాయించడానికి జడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.



భీమవరం పట్టణంలోని నగల దుకాణంలో రద్దీ

పసిడి పండగ

నగల దుకాణాల్లో అక్షయ తృతీయ సందడి

- ధర పెరిగినా.. తగ్గని డిమాండ్
- జోరుగా సాగిన కొనుగోళ్లు



నరసాపురంలోని దుకాణంలో అమ్మకాలు

నరసాపురం/భీమవరం క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగల దుకాణాల్లో బుధవారం అక్షయ తృతీయ సందడి కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. సెంటిమెంట్‌తో కొందరు గ్రాము నుంచి రెండు గ్రాముల బంగారం కొనుగోలు చేశారు. వెండి కన్న బంగారు వస్తువులే ఎక్కువ విక్రయాలు జరిగాయి. గత ఏడాది అక్షయ తృతీయ నాడు గ్రాము బిస్కెట్ బంగారం రూ.7340, ఆర్నమెంట్ బంగారం రూ 6740 పలికింది. ప్రస్తుతం బిస్కెట్ బంగారం గ్రాము రూ. 9780, ఆర్నమెంట్ బంగారం రూ.8990 ఉంది. ధర పెరిగినా కొనుగోలు మొగ్గు చూపారు.

రూ.20 కోట్ల అమ్మకాలు!

జిల్లాలో సుమారు 500 నగల దుకాణాలు ఉన్నాయి. వ్యాపారులు అక్షయ తృతీయకు రెండు రోజులు ముందుగానే ఆఫర్లు ప్రకటించారు. ఒక దుకాణంలో ఎంత బం గారం కొంటే అంత వెండి ఉచితం అని, మరో దుకాణంలో 24 క్యారెట్ల ధరకే వస్తువులు అమ్మకం అంటూ ప్రచారం చేశారు. దాంతోపాటు రూ.2 లక్షల విలువైన వస్తువు కొనుగోలు చేస్తే వెండి పట్టీలు ఉచితం అంటూ రకరకాల ఆఫర్లతో కొనుగోలుదారులు దుకాణాల వద్ద క్యూ కట్టారు. బంగారం ధర చుక్కల్లో ఉన్నా కూడా కొనుగోలు శాతం తగ్గలేదని వ్యాపారులు చెబుతున్నారు. సుమారు జిల్లాలో ఒక్కరోజే సుమారు రూ.20 కోట్ల వరకు వ్యాపారాలు జరిగినట్లుగా అంచనా.

వెండికీ డిమాండ్

అక్షయ తృతీయ సందర్భంగా బంగారంతో పాటు వెండి వస్తువులు కొనుగోలు చేశారు. అక్షయ తృతీయ నాడు బంగారమే కాకుండా వెండి కూడా కొనుగోలు చేస్తే సకల శుభాలు కలుగుతాయన్న ప్రచారంతో కొనుగోళ్లు సాగాయి. కేజీ వెండి ధర రూ.లక్ష తాకినా కొనుగోలులో ఎటువంటి మార్పురాలేదు. వ్యాపారులు కొనుగోలుదారుల కోసం ప్రత్యేకంగా రకరకాల కొత్త మోడల్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. యాండిక్, స్టెర్లింగ్ వంటి సిల్వర్‌ను అందుబాటులో ఉంచారు. బంగారు, వెండి కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడాయి. ఈ హడావుడి ఏడాది పాటు కొనసాగితే వ్యాపారాలకు ఢోకా ఉండదని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కొందరు మాత్రం ధర తగ్గితే వ్యాపారాలు ఇంకా పుంజుకుంటాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇండియా-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ధరలు భారీగా పెరగవచ్చన్న అంచనాలు కొందరు నిపుణులు వేస్తున్నారు.



ద్వారకాతిరుమల ఆలయ అనివేటి మండప ప్రాంతంలో సంచరిస్తున్న భక్త జనులు

చిన వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ పర్వదినం కావడంతో చిన్న వెంకన్న క్షేత్రం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. మంచిరోజు స్వామిని దర్శిస్తే అంతా మంచే జరుగుతుందన్న నమ్మకంతో పలువురు భక్తులు ఆలయానికి వచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కళకళలాడాయి. దర్శనానంతరం యాత్రికులు శ్రీవారి తీర్థప్రసాదాలను, ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దాదాపు 96 జంటలు స్వామివారి నిత్య ఆర్జిత కల్యాణంలో పాల్గొన్నారు.

వైశాఖం.. పెళ్లి భజంత్రీల మోత



ద్వారకాతిరుమల ఆలయ పాత కల్యాణ మండప ప్రాంతంలో జరుగుతున్న పెళ్లిళ్లు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైశాఖ మాస ప్రారంభంలో మంచి ముహూర్తం కావడంతో బుధవారం క్షేత్రంలో జోరుగా వివాహాలు జరిగాయి. మంచి ముహూర్తం, అక్షయ తృతీయ కలిసి రావడంతో పలు వివాహాలకు శ్రీవారి క్షేత్రం వేదికైంది. ఈక్రమంలో ఆలయ అనివేటి మండప ప్రాంతంలోను, అలాగే పాత కల్యాణమండప ప్రాంతం, ప్రైవేటు కల్యాణమండపాల్లో వివాహాలు జరిపారు. ఉదయం 7.23, 10.15, రాత్రి 7.45, 10.59 గంటలకు పలు జంటలు మాంగల్యబంధంతో ఒక్కటయ్యారు. వివాహం ఘట్టం అనంతరం నూతన వధూవరులు, వారి బంధువులు, పెళ్లిజనాలు ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కూల్.. కూల్..



రైల్వే గేటుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన టెంట్

భీమవరం పట్టణం మీదుగా డబ్లింగ్ రైల్వే లైనుతో రైళ్ల రద్దీ పెరిగింది. గూడ్స్ రైళ్లు కూడా ఇటు వైపు మళ్లించడంతో రైల్వే గేట్ల వద్ద వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గంటల కొద్దీ గేట్లువేసి ఉంచడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇంచుమించుగా 15 నిమిషాలకు ఒకసారి రైళ్ల రాకపోకలు కొనసాగిస్తూ ఉండటంతో గేట్లు వేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు రైల్వే గేట్లకు ఇరువైపులా భారీ కర్రలతో పందిళ్ళు కింద ఏర్పాటుచేసి పైన బరకాలు వేశారు. వాహనదారులకు కొంత ఎండ ఇబ్బందులు తగ్గినట్లు అనిపిస్తుంది. వేసవి కాలం అంతా ఇవి ఉంచడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కూడా వీటిని ఏర్పాటు చేశారు. వాటికయ్యే ఖర్చును స్థానిక ప్రజాప్రతినిధులు ఖర్చు పెట్టడంతో వాహనదారులు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– భీమవరం క్రైం, ఆంధ్రజ్యోతి



నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

పోరాట స్ఫూర్తి మేడే

ప్రపంచ కార్మికులారా ఏకం కండి..
పోరాడితే పోయేదేం లేదు..
బానిస సంకెళ్లు తప్ప..

శతాబ్దాల క్రితం కార్మికులు హక్కుల కోసం పోరుబాట పట్టారు. ప్రాణాలొడ్డి మరీ హక్కులు సాధించుకున్నారు. చికాగోలో 1886 మే 1న జరిగిన పోరాటంలో రక్తం చిందించారు. కార్మికలోకం 8 గంటల పని దినాన్ని సాధించుకోవడం చారిత్రక ఘట్టం. కార్మిక హక్కుల సాధనకు స్ఫూర్తినిచ్చే మే 1న ఎర్రదండు ఉవ్వెత్తున కదులుతుంది. చికాగోలో ప్రాణత్యాగాలు స్మరించుకుంటూ నిర్వహించే ర్యాలీలు, ఉత్సవాలు ఇప్పటి కార్మికులకు పోరాట బాటను చూపుతాయి. పోరాటాలతో సాధించుకున్న హక్కులు అమలవుతున్నాయా.. పారిశ్రామికీకరణ విధానాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయా.. దేశంలో మేడేను కార్మికుల పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ దినంగా జరుపుతున్న వేళ ప్రత్యేక కథనం.



- ఉమ్మడి జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులే ఎక్కువ
- నీరుగారుతున్న కార్మిక హక్కులు పోరుబాటలో శ్రామిక శక్తి
- హక్కుల కోసం ఎర్రదండు ఎదురుచూపు

ఏలూరు/తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులు నీరుకారుతున్నాయి. వెట్టిచాకిరి తప్ప బతుకులు మార్చే చట్టాల కోసం కార్మికులు పరితపిస్తున్నారు. పోరాటాలతో కార్మికులు తెచ్చుకున్న 8 గంటల పనిదినాలు, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం నినాదాలు నేటికీ కార్మికుల ఉద్యమాల్లో కనిపిస్తూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సంఘటిత రంగ కార్మికులు వేలల్లో జిల్లాలో ఉంటే అసంఘటిత రంగాల్లో 25 రకాల పనులు చేసే కార్మికులు సుమారు 6 లక్షల మంది ఉన్నారు. భవన నిర్మాణ కార్మికులు, ఆటో, ముఠా కార్మికులతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాల్లోని పొగాకు, ఆయిల్‌పామ్, కొబ్బరి వలుపు, పీచు, కల్లుగీత, వడ్రంగి, చేనేత తదితర రంగాల్లో కార్మికుల పనిచేసే చోట పని భద్రత లేదు. ప్రధానంగా 8 గంటలకు పనిదినాలు సక్రమంగా అమలు జరగడం లేదు. రోజువారీ కూలీ కోసం కూడా కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలు చేస్తేనే కూలీ రేట్లు పెరుగుతు న్నాయి. ఏలూరు నగరంలో రెండు జూట్‌మిల్లుల ఎత్తివేతతో 6వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇప్పుడిప్పుడే రోజువారీ కూలీ, ముఠా, భవన నిర్మాణ, ఇసుక కూలీలుగా మారారు. కార్మికులు హక్కుల పరిరక్షణకు అసంఘటిత రంగంలో కార్మికులకు కోసం సమగ్ర చట్టాన్ని తేవాలని కార్మిక సంఘాలు నినదిస్తున్నాయి. ప్రధానంగా 2014 నుంచి కార్మిక చట్టాలను దశలవారీగా ఎత్తివేసి 29 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక బోర్డుల కింద చేర్చడంతో సమ్మె హక్కును కోల్పోయారు. కార్మిక సంఘంగా నమోదు కావాలంటే ఒకప్పుడు కనీసం ఏడుగురు గరిష్ఠంగా 10 మంది ఉంటే కార్మిక సంఘంగా నమోదు జరిగేది. నేడు ఆ సంఖ్య 100 మంది ఉంటేనే గానీ కార్మిక సంఘంగా నమోదు చేయకపోవడంతో కార్మిక సంఘాల ఏర్పాటు సాధ్యం కావడం లేదు. విభజించి పాలించే విధానం అసంఘటిత రంగాల్లో అమలు చేస్తే పెట్టుబడి, బడా కంపె నీలకు చేయూత ఇచ్చేలా ప్రభుత్వాలు వ్యవహరి స్తున్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కనీసం పీఎఫ్, గ్రాడ్యుటీ అయినా అమలు చేయాలని గొంతెత్తి పోరాటాలు చేస్తు న్నారు. ప్రమాద బీమా, ఇతర రాయితీలు దక్కక కేవలం వేతనంపై బతుకు జీవుడా అంటూ వారు నిత్యం మదనపడుతూనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికే హక్కులు, పనిభద్రత పోరాటాలు చేస్తూనే ఉన్నారు. కేంద్ర రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బ్యాంకులు, బొగ్గు, పోర్టులను ప్రైవేటీకరణ బాటలో పయ నింపచేయడంపైన కార్మిక సంఘాల్లో ఆందోళ నకు దారితీసింది.

ప్రస్తుత పరిస్థితి దయనీయం

ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోగా శ్రమ దోపిడి చేస్తున్నారని కార్మిక నాయకుల ఆవేదన. ముఖ్యంగా ప్రభుత్వ రంగాలైన మునిసిపల్, ఆర్టీసీ, రైల్వే శాఖలలో కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకపోగా ఉన్నవారిపైనే పని భారం మోపి శ్రమను దోచుకుంటున్నారనేది కార్మికుల ఆవేదన. ప్రైవేటు కర్మాగారాల్లో కనీస వేతనం ఇవ్వకపోవడంతోపాటు కనిస పనిగంటల నియమం అమలు చేయకుండా కార్మికులను మోసగిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు.

నిర్మాణ కార్మికులకు మొండిచేయి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసుకున్న నిధిని సైతం గత ప్రభుత్వం దోచుకుందని నేటికీ భవన నిర్మాణ కార్మికులు ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. 2019లో రూ. వెయ్యి కోట్లు దారి మళ్లించి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిర్వీర్యం చేశారని అసెంబ్లీలో కార్మిక శాఖ మంత్రి చెప్పడం కార్మికుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది. ఎన్నికల ముందు వారి సమస్యల కోసం కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని భవన నిర్మాణ కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అసంఘటిత ఈ శ్రమ్ కార్డులు

అసంఘటిత రంగ కార్మికులకోసం ప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డులు అందిస్తోంది. ప్రతీ కార్మికుడు ఈ కార్డులు తీసుకోవడం ద్వారా వారికి ప్రమాదంలో మరణం సంభవిస్తే రూ.2లక్షల సాయం అందిస్తుంది. దీనితో పాటు ప్రమాదంలో ఏమైనా అవయవాలు కోల్పోతే వందశాతం క్లెయిం చేసేందుకు వీలుంది. తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు పరిధిలో లక్షకు పైగా ఈ-శ్రమ్ కార్డులు నమోదు చేయడం జరిగింది. కార్మికుల పరిరక్షణకు దోహదపడుతుంది. వాటితోపాటు భవన నిర్మాణ కార్మికుల బోర్డు పునరుద్ధరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

కూచిపూడి గోపికుమార్,
లేబర్ ఆఫీసర్, తాడేపల్లిగూడెం



కార్మికవర్గాల ప్రధాన డిమాండ్లు..

- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేటీకరణ విధానాలను విడనాడాలి
- ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి.
- అసంఘటిత రంగ కార్మికుల పరిరక్షణకు కేంద్రం సమగ్ర చట్టం తేవాలి
- 44 కార్మిక చట్టాలను అమలు చేయాలి.
- నాలుగు కార్మిక బోర్డులను రద్దు చేయాలి.
- అందరికి 8 గంటల పని కొనసాగించాలి
- ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు విడనాడాలి
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి.

హక్కులు హరిస్తున్నారు



కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను హరించింది. కార్మిక శాఖ అధికారాలు నిర్వీర్యం చేసింది. కార్మిక శాఖ సంక్షేమ శాఖగా మార్చేశారు. కార్మికులకు న్యాయం జరిగేలా కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని పోరాటాలు చేస్తున్నాం. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి దయనీయం. ప్రభుత్వం కార్మికుల హక్కులు కాపాడాల్సిన అవసరం ఉంది. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

డి.సోమసుందర్,
రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ

కార్మికులకు న్యాయం చేయాలి



కార్మిక చట్టాల రద్దుతో అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం జరగడం లేదు. అసంఘటిత రంగ కార్మికులు హక్కులను కాలరాయడం తగదు. వారికి సమగ్ర చట్టం తీసుకురావాలి. కార్మికుల న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వాలు కట్టుబడి పనిచేయాలి.

బండి వెంకటేశ్వరరావు,
జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ

పనిభద్రత కల్పించాలి



వ్యవసాయ, అనుబంధ రంగ కార్మికులకు పనిభద్రత లేదు. ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియాలు అమలు చేయాలి. పనిచేసే చోట్ల మౌలిక వసతులు కల్పించాలి. రక్షణకు ప్రభుత్వం చట్టాలు చేయాలి. బోర్డుల ఏర్పాటుతో న్యాయం జరగడం లేదు. కూలీలకు అరకొర వేతనం ఇస్తున్నారు.

కె.శ్రీనివాస్, జిల్లాకార్యదర్శి, రైతు సంఘం

కార్మికులకు న్యాయం చేయాలి



పనికి సమానవేతనం ఇవ్వాలని కీలకమైన సుప్రీంకోర్టు తీర్పు ఉన్న ఎక్కడ అమలు జరగడం లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలి. వారికి ప్రమాద బీమా అమలు చేయాలి. ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

చోడగిరి శ్రీనివాస్,
అధ్యక్షుడు, ఉమ్మడి ఎన్జీవో జేఏసీ

గత ప్రభుత్వ తీరుతో విసిగిపోయాం



గత ప్రభుత్వ తీరుతో పూర్తిగా విసిగిపోయాం. కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తుందని ఆశించాం. కానీ నేటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా కనిపించలేదు. మా సంక్షేమ బోర్డును అయినా పునరుద్దరించాలి. రాష్ట్రంలో 46వేల దరఖాస్తున్నాయి వాటిని పరిష్కరించాలి.

పోలిరాతి ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మిక సంఘం

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో

భగభగలు

- అత్యవసర విభాగంలో ఏసీలు మాయం
- మరమ్మతులకు పంపి.. తిరిగి ఏర్పాటు చేయలేదు
- వెంటిలేషన్.. కిటికీలు లేక పేషెంట్ల హాహాకారాలు
- ఐసీయూ.. బర్న్స్ వార్డుల్లో మంటలే
- పట్టించుకోని అధికారులు



అత్యవసర విభాగం వార్డు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జిల్లాలో 42 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత నమోదవుతోంది. రోడ్డు, ఇతర ప్రమాదాల్లో బాధితులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అత్యవసర విభాగంలో ఉక్కబోతతో అల్లాడుతున్నారు. ఆస్పత్రి అత్యవసర చికిత్స విభాగంలో 3 ఏసీలను ఏర్పాటు చేశారు. మరమ్మతులకు గురికావడంతో వేసవిలో కూడా మూలనపడి ఉన్నాయి. ఏసీ రూములు కావడంతో వెంటిలేషన్, కిటికీలు లేవు.

ఐసీయూలో కొన్ని ఏసీలు మాత్రమే పని చేస్తున్నాయి. బర్న్స్ వార్డులో కూడా ఇదే పరిస్థితి. అత్యవసర విభాగంలో ఏడాదిపైగా ఏసీలు పాడైనా పట్టించుకోలేదు. అవి కూడా పనిచేస్తున్నాయని రికార్డుల్లో చూపించడం గమనార్హం. వేసవి ఎండలు ఉండడంతో ఆసుపత్రికి వచ్చిన వారు కనీసం అత్యవసర విభాగం చికిత్స రూమ్‌లో ఏసీలు ఉంటే కొంత ఉపశమనం పొందగలుగుతారు. అధికారులు తక్షణం ఏసీలను ఏర్పాటుచేయాల్సి ఉంది.



ఏసీ మరమ్మతులకు పంపించారు.. తిరిగి ఏర్పాటు చేయలేదు


మరమ్మతుకు పంపుతారు.. తిరిగి రాదు!

ఏసీలు పనిచేయక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి కావాల్సిందే. ఏసీలు పనిచేస్తున్నాయని ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారే తప్ప వాటిని మరమ్మతులు చేయిస్తున్న దాఖలాలు లేవు. ఆసుపత్రిలో 79 ఏసీలు పనిచేస్తున్నాయని మార్చి నెలలో అధికారులు ప్రకటించారు. వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తే ట్రామా కేర్‌లో 5 ఏసీలు ఉండాలి. 2 ఏసీలను మరమ్మతుల నిమిత్తం తొలగించి చాలా కాలమైనా తిరిగి బిగించలేదు. ప్రస్తుతం 3 ఏసీలు మాత్రమే ఉన్నాయి.

ప్రోబ్లం జోన్

ఎకరా రూ.6,000

ఎండు గడ్డికి గిరాకీ



- పశుగ్రాసం కొరత
- పశు పోషణకు ఇబ్బందులు
- పెరుగుతున్న పెట్టుబడి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పశు గ్రాసం ఎండు గడ్డికి గిరాకీ పెరిగింది. ముఖ్యంగా ఆవులు, గేదెలకు ఎండు గడ్డి ప్రధాన ఆహారం. గతంలో ప్రతీ రైతు వరి కోతల అనంతరం గడ్డిని మేటువేసి నిల్వ చేసేవారు. ప్రస్తుతం మిషన్ల కోతతో గడ్డి లభించక పశుపోషణ భారంగా మారింది. ఎకరం గడ్డి సుమారు 5 నుంచి రూ.6వేలు ధర పలుకుతోందని పాడి రైతులు చెబుతున్నారు. 2 ఆవులు, 2 గేదెలు ఉంటే ఏడాదికి సుమారుగా 5 ఎకరాల గడ్డి అవసరం అవుతుంది. గడ్డిని కొని తడవకుండా మేట వేసుకోవానికి, కూలీల ఖర్చులతో కలిపి రూ.40వేలు వరకూ అవుతోందని దిగమర్రుకు చెందిన పాడి రైతు జయరామ్ చెబుతున్నారు. ఎకరం వరి చేలు కూలీలతో కోసిన గడ్డి అయితే రూ. 7, 8 వేలు, మిషన్ కోత అయితే ఎకరం గడ్డి రూ. 5, 6 వేలు ధర చెబుతున్నారని ఆయన చెబుతున్నారు. గడ్డి కాకుండా పశువులకు చిట్టు, తవుడు, దూగర, ఉలవలు వంటి ఇతర దాణా పెట్టాల్సి ఉంటుంది. పెరిగిన ధరలతో పశు పోషణ కష్టతరంగా ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ పాఠశాలలు మూసివేత

విద్యార్థులు లేక భవనాలు నిరుపయోగం

పెనుగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో నిష్ణాతులైన టీచర్లు నాణ్యమైన విద్యనందిస్తున్నా తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కూడా కష్టంగా మారింది. పెనుగొండ మండలంలో మారుమూల ప్రాంతాల్లో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు పిల్లలు లేక మూతపడుతున్నాయి. రామన్నపాలెం శివారు కామధేనులంక పాఠశాల విద్యార్థులు లేక మూత పడింది. ఇక్కడ ఉన్న కొద్ద మంది పిల్లలను వేరే పాఠశాలకు పంపలేక ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. చినమల్లం శివారు తామరచెరువు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో మూత పడింది. ఉన్న కొద్ది మందీ కిలోమీటరు దూరంలో పాఠశాలలకు వెళుతున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పథకాలు వర్తించేలా చర్యలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.



రామన్నపాలెం శివారు కామధేనులంక, చినమల్లం శివారు తామరచెరువులో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనాలు

క్రైమ్ కార్నర్



తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఇటుకల ట్రాక్టరు బోల్తా

» ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

తణుకు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : తణుకు నుంచి పెరవలి వెళ్లే జాతీయ రహదారి మార్గంలో పాత టోల్‌గేట్ వద్ద బుధవారం ఇటుకల ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా కొట్టింది. రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఇటుకుల ట్రాక్టరు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నుంచి తాడేపల్లిగూడెం వస్తుంది. ట్రాక్టరుపై నలుగురు కూలీలు ఉన్నారు. వీరంతా పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన నక్కా ఏసు(45) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇంకా తొంటి దుర్గాప్రసాదు, సీహెచ్.నాగబాబు, మద్దే ఏసుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లిని సెలవులకు తీసుకొస్తుండగా..

» బైక్‌ను ఢీకొట్టిన వాహనం.. అన్నయ్య మృతి



ఏసుబాబు మృతదేహం

నూజివీడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ఇవ్వడంతో చెల్లిని తీసుకొచ్చేందుకు బైక్‌పై వెళ్లి వస్తున్న అన్నయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన నూజివీడు మండలం బత్తులవారిగూడెం గ్రామం వద్ద జరిగింది. ఏలూరు జిల్లా పెదపాడు మండలం పాతముప్పర్రు గ్రామానికి చెందిన ఏసుబాబు(39) తన చిన్నాన్న కుమార్తె మైలవరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీ-ఫార్మసీ చదువుతోంది. ఆమెకు సెలవులు ఇవ్వడంతో ఇంటికి తీసుకొచ్చేందుకు బుధవారం బైక్‌పై మైలవరం వెళ్లివస్తుండగా మార్గమధ్యలో బత్తులవారిగూడెం వద్ద ఓ వాహనం ఢీకొని ఇద్దరూ గాయాలపాలయ్యారు. గాయపడిన అతడిని స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



రామాంజనేయులు (ఫైల్)

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): లక్కవరం వద్ద ఎర్రకాలువలో గేలంతో చేపల వేటకు వెళ్లిన దల్లి రామాంజనేయులు(40)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడిమృతి చెందినట్టు లక్కవరం ఎస్ఐ శశాంక బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. లక్కవరం గ్రామానికి చెందిన రామాంజనేయులు కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అప్పుడప్పుడు కాలువలో గేలంతో చేపలు పడుతూ ఉంటాడు. ఈనెల 29న సాయంత్రం గ్రామ సమీపంలోని ఎర్రకాలువలో గేలంతో చేపల వేటకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రంతా గ్రామంలో వెతికినప్పటికీ ఆచూకీ లేదు. బుధవారం ఉదయం అతడి మృతదేహం ఎర్రకాలువలో తేలుతూ కనిపించింది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ శశాంక, ఏఎస్ఐ భాస్కర్ ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య నాగమణి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):అప్పుల బాధలు తాళలేక మండలంలోని శ్రీనివాసపురానికి చెందిన తోట రాంబాబు (37) అనే రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కే జబీర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో మృతుడు రాంబాబు మొక్కజొన్న సాగు చేయగా నష్టం వచ్చింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురై బుధవారం మైసన్నగూడెం పామాయిల్ తోటలో గేదెలను కట్టే తాడుతో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అప్పన్నపేటలో చోరీ

గణపవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : గణపవరం మండలం అప్పన్నపేట గ్రామంలో కొచ్చెర్ల అప్పారావు ఇంటిలో దొంగలుపడి బంగారపు వస్తువులను అపహరించారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ మణికుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించి చెక్క బీరువా లాకర్లు పగులకొట్టి బంగారం వస్తువులు అపహరించారన్నారు. పోయిన బంగారపు వస్తువుల విలువ తెలియాల్సి ఉందన్నారు. బుధవారం బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బైక్ చోరీ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నరసాపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బైక్ తస్కరించిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రొక్కం వరలక్ష్మి తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు లైజన్ ఏఎస్ఐ కె.ఎస్ భాస్కరరావు తెలిపిన వివరాలివి.. వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామానికి చెందిన కారిపల్లి దొరబాబుకు చెందిన రూ.2లక్షలు విలువ గల బైక్ అతడి ఇంటి వద్దనే గత ఏడాది ఆగస్టు 22న బైక్ దొంగిలించారంటూ బాధితుడు ఫిర్యాదు చేయడంతో నరసాపురం రూరల్ ఎస్ఐ టీవీ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. ఈ కేసు విచారణలో అనాకోడేరుకు చెందిన యలమంచిలి సతీశ్‌బాబు, నర్సయ్యఅగ్రహారానికి చెందిన కర్రి రాము, భీమవరం దుర్గాపురానికి చెందిన నారా ధనుష్ దొంగతనం చేసినట్టు నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. ఈ కేసులో ఏపీపీ ఎంఏ హమీద్ వాదనలు వినిపించగా ఎస్ఐ సురేష్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ వి.ఉమామహేశ్వరరావు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

ఇక అభివృద్ధి వైపు అడుగులు!



పట్టణాలు అభివృద్ధివైపు అడుగులు వేయనున్నాయి. ప్రభుత్వం ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీలు తమ సొంత నిధులతో చేపట్టే పనులకు బిల్లులు తక్షణమే విడుదలయ్యేలా ఆర్థిక వెసులు బాటు కల్పించింది. మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో మున్సిపాలిటీలు ఊపిరిపీల్చుకున్నాయి. కాంట్రాక్టర్‌లకు ఊరట లభించింది. పట్టణ ప్రజలకు ఇది ఎంతగానో మేలుచేకూర్చనుంది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

మునిసిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ

- » సొంత నిధులు వినియోగించుకునే అవకాశం
- » పల్లెల మాదిరిగానే పట్టణాలకు వెసులుబాటు
- » ఇక బిల్లులకు వేచి చూడాల్సిన పనిలేనట్టే
- » బడ్జెట్‌లో కేటాయించిన నిధులకే పరిమితం
- » మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

(భీమవరం-ఆంధ్రజ్యోతి) :

ప్రజలు చెల్లించే ఆస్తిపన్ను, నీటి పన్ను, భవన నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయం అంతా ఇప్పటివరకు ప్రభుత్వ ఆజమాయిషిలో ఉండేది. పేరుకే మునిసిపాలిటీ నిధులు. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే బిల్లులు మంజూరయ్యేవి. పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించారు. పంచాయతీల్లో ప్రజలు చెల్లించే పన్ను ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేసుకునే అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి పట్టణాల్లోనూ చర్చ జరుగుతోంది. మున్సిపల్ శాఖలోనూ అంతర్మథనం ప్రారంభమైంది, తుదకు పట్టణాల్లో వచ్చే ఆదాయాన్ని మున్సిపాలిటీలు ఖర్చుపెట్టుకుంటే బిల్లులు కూడా పెండింగ్ లేకుండా మంజూరు చేసే వెసులుబాటు ఇచ్చారు. ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది.

చేపట్టే పనులు ఇవే..

మున్సిపాలిటీల్లో రహదారులు, డ్రెయిన్‌ల నిర్వహణకు నిధులు వెచ్చించుకోవచ్చు. పార్కులు, నీటి వనరుల అభివృద్ధి-నిర్వహణ, పారిశుధ్య నిర్వహణకు అవసరమైన వసతులు, పాఠశాలలు, మునిసిపల్ వాణిజ్య సముదాయాల నిర్వహణ, శ్మశాన వాటికల అభివృద్ధి, అన్నా క్యాంటీన్‌ల నిర్వహన, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు వంటి వాటికి ఖర్చు పెట్టుకోవచ్చు. ఇప్పటివరకు పనులు నిర్వహిస్తే బిల్లుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడేది. కొత్త రహదారులు, డ్రెయిన్ల నిర్మాణంపై మార్గదర్శకాల్లో స్పష్టత ఇవ్వలేదు. కొత్త నిర్మాణాలపై అవకాశం ఇస్తే ఆర్థికంగా బలోపేతంగా ఉండే భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు వంటి మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం మున్సిపాలిటీలతోపాటు, ఆకివీడు నగర పంచాయతీలో ప్రతిఏటా పన్ను రూపంలో దాదాపు రూ.75 కోట్ల మేర ఆదాయం లభిస్తుంది. ప్రజలు చెల్లించే ఆస్తిపన్ను రూపంలో ఆ మొత్తం సమకూరుతోంది. దానికితోడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, పట్టణ ప్రణాళిక ద్వారా అదనంగా మరో రూ.25 కోట్లు మేర ఆదాయం సమకూరుతోంది. మార్కెట్ ఆశీలు, మున్సిపల్ షాపుల ఆదాయం కలసివస్తోంది. మొత్తంపైన రూ.120 కోట్లకుపైగా జిల్లాలో మున్సిపాలిటీలకు సొంత నిధులు అందుబాటులో ఉంటున్నాయి. వీటిపై మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ లభించింది.

బడ్జెట్‌లో కేటాయించాల్సిందే

ప్రతి ఏటా మున్సిపాలిటీలు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతాయి. బడ్జెట్‌కు అనుగుణంగానే మున్సిపాలిటీలు ఖర్చుపెట్టుకోవాలి. అంతే తప్పా తమకు నచ్చిన రీతిలో వెచ్చించుకునే అవకాశం లేదు. ముందుగానే ఏ పనులకు ఎంతమేర కేటాయించవచ్చో అంచనాలు వేసుకోవాలి. బడ్జెట్‌ను ఆ మేరకు పంపిణీ చేయాలి. ఏడాది అంతా ఆ విధంగానే వ్యయం చేయాలి. అప్పుడే బిల్లులు మంజూరవుతాయి. దీనివల్ల మున్సిపాలిటీలకు మేలు జరుగుతుంది. ముందస్తు ప్రణాళికల ఆధారంగానే నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల్లో ఈవిషయాన్ని స్పష్టం చేసింది. ఇప్పటివరకు మున్సిపాలిటీల్లో చేపట్టే పనులకు బిల్లులు మంజూరు చేయాలంటే నెలలతరబడి వేచి చూడాల్సి వస్తోంది. కనీస మరమ్మతులు వంటి పనులు చేపట్టినా సరే బిల్లులు మంజూరయ్యేవి కావు. తాజా వెసులుబాటుతో మున్సిపాలిటీలకు అటువంటి కష్టాలు ఉండవు. మున్సిపాలిటీల చరిత్రలో ఇదో మైలు రాయిగా అంతా చర్చించుకుంటున్నారు.

రబీలో 1.84 లక్షల ధాన్యం కొనుగోలు

» ధాన్యం సేకరణ 2.20 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు » ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ఇప్పటివరకు 1.84 లక్షల మెట్రిక్ టన్నుల రబీ ధాన్యాన్ని కొనుగోలు చేశామని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో రబీ ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ రైస్‌పై రైస్‌మిల్లుల యాజమాన్యాలతో, పౌరసరఫరాల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ 2024-25కు రైతుల నుంచి ధాన్యం సేకరణలో భాగంగా తొలుత 1.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించామని, జిల్లా యంత్రాంగం వారి సూచనల మేరకు ధాన్యం దిగుబడి ఎక్కువగా ఉన్నందున లక్ష్యాన్ని 2 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామన్నారు. తదుపరి జిల్లా వ్యవసాయ శాఖాధికారి, ఏలూరు వారి నివేదిక ప్రకారం ధాన్యం దిగుబడి ఎక్కువగా ఉన్నందున జిల్లా యంత్రాంగం మరో 20 వేల మెట్రిక్ టన్నుల అదనపు లక్ష్యాన్ని నిర్ధేశించారన్నారు. ఏలూరు జిల్లాలో లక్ష్యం 2 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2.20 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఓపెన్ మార్కెట్‌లో 677.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారు. ఓపెన్ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలును పెంచాలని జేసీ మిల్లర్లను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర అందించాలని, లేనిఎడల రైస్‌మిల్లుల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా 44,53,250 గోనె సంచులను రైతులకు సరఫరా చేసి జిల్లా 1.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్దనుంచి కొనుగోలు చేశామన్నారు. రైతుల కోరిక మేరకు పెంచిన లక్ష్యానికి అనుగుణంగా 9 లక్షల గోనె సంచులు అవసరం అవుతాయన్నారు. కానీ రైతు సేవా కేంద్రాల వద్ద అదనంగా 11,82,696 గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు తగిన ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం చేసి ఉందని, దానికి గాను టార్పాలిన్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా లక్ష్యంలో సీఎంఆర్ రైస్ 15వేల మెట్రిక్ టన్నులను ఎఫ్‌సీఐ గొడౌన్‌కు, మిగిలిన 1,32,400 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ గొడౌన్‌లకు తరలించాలన్నారు. ప్రభుత్వం వారు నిర్ణయించిన సమయలో అందించని ఎడల సదరు రైస్ మిల్లుల యాజమాన్యంపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



ఆకివీడు కొత్త బస్టాండ్ వద్ద ఆగిన బస్సు

ఆగిన ఆర్టీసీ బస్సు

» ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

ఆకివీడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు రోజూ ఎక్కడో ఒకచోట మరమ్మతులకు గురై ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం భీమవరం నుంచి ఏలూరు వెళుతున్న బస్సు స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. భీమవరం డిపోకు చెందిన బస్సు భీమవరం నుంచి సుమారు 40 మంది ప్రయాణికులతో ఏలూరు వెళుతుఊ స్థానిక జానకమ్మ ఆసుపత్రికి వచ్చేసరికి సాంకేతికలోపం తలెత్తడంతో డ్రైవర్ కొత్త బస్టాండ్ వరకూ తీసుకొచ్చారు. ప్రయాణికులను ఇతర బస్సులలో పంపించారు.

భర్త బతికుండగానే ఒంటరి మహిళకు పింఛన్!

» రద్దు చేయాలని భర్త ఫిర్యాదు

ఏలూరురూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్ డబ్బుల కోసం భర్త బతికుండగానే నకిలీ సర్టిఫికెట్ సమర్పించి ఒంటరి పింఛన్ పొందుతోంది ఓ మహిళ. డబ్బుల కోసం అక్రమానికి పాల్పడిందని.. పింఛన్ రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌ను కలిసి భర్త పిర్యాదు చేయడం గమనార్హం. వివరాలివి.. పెదపాడు మండలం పాత ముప్పర్రుకు చెందిన ఆర్.జలప్రవీణ్‌కుమార్ ప్రైవేట్ పనులు చేస్తుంటాడు. అతడికి 16 ఏళ్ల క్రితం పెదవేగి మండలం వేగివాడకు చెందిన శాంతితో వివాహమైంది. వారికి ఇద్దరు మగపిల్లలు సంతానం కాగా దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా ఏడేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. పిల్లలిద్దరూ తండ్రి వద్దే పెరుగుతున్నారు. 2019లో వైసీపీ పాలనలో కొందరు వైసీపీ నాయకుల ప్రోద్బలంతో తాను ఒంటరి మహిళనని అధికారులను తప్పుదోవ పట్టించి, నకిలీ ధ్రువపత్రం స మర్పించి పింఛన్ పొందు తుందని భర్త పిర్యాదు చేశారు. భార్యకు దూరంగా ఉంటున్నానని, విడాకులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. గతంలో ఇదే విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏ అధికారి పట్టించుకోలేదన్నారు. పింఛన్ పొందేందుకు పంచా యతీ అధికారులు పూర్తిగా సహకరించారని తెలిసింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టి పింఛన్ రద్దు చేయాలని కోరారు.

ప్రాణం మీదకు తెచ్చిన స్నేహితుడి సరదా

» విద్యుత్ షాక్‌కు గురైన విద్యార్థి.. ఆసుపత్రికి తరలింపు



గాయాలపాలైన సందీప్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ ఆడుతూ ఓ స్నేహితుడు సరదాగా ఏడిపించడానికి మరో స్నేహితుడి చెప్పును ట్రాన్స్‌ఫార్మర్ ఐరన్ ఫెన్సింగ్ వద్దకు విసరడంతో అది తీసుకోవడానికి వెళ్లిన అతడికి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దెందులూరుకు చెందిన ఎస్.సందీప్ అనే విద్యార్థి జూనియర్ ఇంటర్ ఉత్తీర్ణుడయ్యాడు. బుధవారం ఉదయం స్నేహితులతో కలిసి ఏలూరు ఇండోర్ స్టేడియంలో క్రికెట్ ఆడేందుకు వచ్చాడు. స్నేహి తులలో ఒకడు అతడి చెప్పులను తీసుకువెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఐరన్ ఫెన్సింగ్ వద్దకు విసిరాడు. వాటిని తెచ్చుకోవడానికి వెళ్లిన సందీప్ ఐరన్ ఫెన్సింగ్ తగలడంతో విద్యుత్ ప్రవహించి కాలుపై గాయమైంది. మిగిలిన స్నేహితులు వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బయటకు తీసుకువెళ్లి పోయారు.



వృద్ధమాతల ఆశ్రమంలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ సీవో కల్నల్ అమిత్‌పాండే

మేమూ మీ బిడ్డలమే / ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కన్నబిడ్డలు దూరంగా ఉంచినా, వదిలేసినా నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దని, తమనం దరినీ జన్మనిచ్చిన బిడ్డలుగానే పరిగణించాలని ఎన్‌సీసీ ఆంధ్రా బెటాలియన్ జిల్లా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే భరోసా ఇచ్చారు. స్థానిక మాదేపల్లి రోడ్డులోని ప్రేమాలయం వృద్ధమాతల ఆశ్రమాన్ని బుధవారం ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి సందర్శించారు. పలు వినోదాత్మక కార్యక్రమాలతో వృద్ధుల్లో ఆనందోత్సాహాలను నింపే ప్రయత్నం చేశారు. ఆశ్రమానికి రావడానికి దారితీసిన పరిస్థితులు తదితర విషయాలను వృద్ధులనుంచి అడిగితెలుసుకున్నారు. ఇక మీదట ఎటువంటి సాయం కావాలన్నా తమను సంప్రదించాలని సూచించారు. తమవంతు సాయంగా ఒక బియ్యం బస్తా, పండ్లు, బిస్కెట్లు, సబ్బులను వృద్ధమాతలకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.కొండయ్య, సుబేదార్లు ఆదినారాయణ, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధి పట్టని ప్రభుత్వాలు

» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

వేలేరుపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. సీపీఐ 17వ మండల మహాసభ బుధవారం మల్లారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పహలాగ్రామ్‌లో జరిగిన దుర్ఘటనను పార్టీ తరపున ఖండిస్తున్నామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటూ ఆదుకోవాలన్నారు. గిరిజన తెగలకు, గిరిజన ప్రాంతాలభివృద్ధికి నిధులు కేటాయించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. గిరిజన చట్టాలైన జీవో నంబరు 3ను సక్రమంగా అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన మండలమైన వేలేరుపాడు మండలంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనడానికి ఒక ఉదాహరణగా పెదవాగు ప్రాజెక్టును గాలికి వదిలేయడమేనన్నారు. మహాసభ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ.మున్నీర్, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నేపల్లి సాయిబాబు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పండితవిల్లూరులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీవో జ్యోతిర్మయి

చెత్త సేకరణలో చిత్తశుద్ధి ఉండాలి

» ఎక్కడిబడితే అక్కడ చెత్తవేస్తే చర్యలు తీసుకుంటాం
» డీఎల్‌పీవో జ్యోతిర్మయి

పోడూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : డంపింగ్ యార్డులకు తరలించే చెత్తసేకరణలో చిత్తశుద్ధి ఉండాలని, ఎవరూ చూడడం లేదని కాల్వలోనూ, రోడ్లపక్కన పారేస్తే ప్రజలు రోగాలు భారిన పడతారని నరసాపురం డివిజన్ పంచాయతీ అధికారిణి జ్యోతిర్మయి సూచించారు. బుధవారం పండితవిల్లూరులో డంపింగ్ యార్డులను ఆమె పరిశీలించి గ్రామంలో పలువీధులను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ సందర్శనలో గృహిణులను కలిసి ఇళ్లకు వచ్చి చెత్త సేకరించే గ్రీన్ వెహికల్స్‌పై అవగాహన కల్పించారు. ఇళ్లల్లోని చెత్తను గ్రీన్ వెహికల్స్‌లో మాత్రమే వేయాలని ఎక్కడిబడితే అక్కడ వేయవద్దని సూచించారు. సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక, ఈవోపీఆర్డీ కేఎం. వైభవతి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.కె.వెంకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం

సంరక్షణ కేంద్రంలో వున్న చూడి ఆవు మృత్యువాత



మృతి చెందిన చూడి ఆవు

నరసాపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బుధవారం చూడి ఆవు మృత్యువాత పడింది. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా శానిటేషన్ సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా చెత్త ట్రాక్ట ర్‌లో డపింగ్‌యార్డుకు తరలించారు. అక్కడ అవును ఖననం చేయలేదు. పేరుకుపోయిన చెత్త కింద మృతి చెందిన అవును కప్పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. ఇటు కౌన్సిల్ కూడా అధికారుల తీరుపై స్వపక్ష, విపక్ష సభ్యులు మండిపడ్డారు. విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల పట్టణంలో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుం డడంతో మునిసిపాల్టీ వీటిని పట్టుకుని కార్యాల యం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రంలో ఉంచింది. వీటికి మేత, నీటి సౌకర్యాం కల్పించేందుకు ఇద్దరు ఉద్యోగుల్ని ఏర్పాటు చేసింది. ఈ విధంగా సంరక్షణ కేంద్రంలో ఉంచిన ఆవులను తిరిగి యజమాని తీసుకెళ్లాలంటే పురపాలక సంఘానికి జరిమానాను రోజుల్ని బట్టి రూ.రెండు నుంచి రూ.నాలుగు వేలు వరకు అపరాధ రుసుం వేస్తున్నారు. ఇంతపెద్ద మొత్తం చెల్లించలేక కొందరు యాజమానులు సంరక్షణ కేంద్రంలోనే ఉంచేస్తున్నారు. ఈక్రమంలో చూడి ఆవు మృత్యువాత పడిన ఘటన జరిగింది.





స్వర్ణవారిగూడెంలో పొగాకు పంట, ములగలంపల్లిలో పామాయిల్ తోట పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జీలుగుమిల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నష్టపోయిన పొగాకు, మిర్చి, మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి సీహెచ్.సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ములగలంపల్లి, రౌతుగూడెం, స్వర్ణవారిగూడెం, పాములవారిగూడెం గ్రామాల్లో మంగళవారం రాత్రి ఈదురుగాలులు, వర్షం కురిసి నష్టపోయిన ప్రాంతాలను రైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. పొగాకు బ్యారన్‌ల వద్ద షెడ్లు కూలిపోవడం, షెడ్లపై రేకులు ఎగిరిపోవడం, చెట్లు నేలకూలడం వల్ల నష్టపోయామని రైతులు చెప్పారు. పాములవారిగూడెంలో రైతు వై.శ్రీనివాసరావు చెందిన పామాయిల్‌తోటలో చెట్లు మొదళ్లతో పాటు లేచి పడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షంతో రైతులకు కొంతనష్టం జరిగిందని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ



ఉంగుటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనపై వెల్లమిల్లిలో చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయకర్త ఆర్.వినోద్ కుమార్ నాయకత్వంలో బుధవారం గ్రామ పెద్దలతో గుడిలో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే (1098) సమాచారం ఇవ్వాలన్నారు.

పాండురంగ స్వామికి ప్రత్యేక పూజలు



ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : పాతబస్టాండు సెంటర్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా ఆలయార్చకులు దండి భొట్లకనక సుందర శర్మ స్వామిని చందనంతో అలంకరించి భక్తులతో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతులకు రాయితీపై జీలుగు విత్తనాల పంపిణీ

పోలవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మూడు రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు తెలిపారు. బుధవారం కొత్తరామయ్యపేట పునరావాస కాలనీలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మండలంలో వంద క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయాధికారి తెలిపారు. గూటాలలోని రెండు రైతు సేవా కేంద్రాల్లో 50 క్వింటాళ్లు, పట్టిసీమలో 10 క్వింటాళ్లు, పోలవరం మూడు రైతు సేవా కేంద్రాల్లో 40 క్వింటాళ్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గునపర్తి చిన్ని, కరిబండి నాగరాజు, పాదం ప్రసాదు పాల్గొన్నారు.

పంగిడిగూడెంలో సీలింగ్ భూములు పంచాలి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : పంగిడిగూడెంలోని ప్రభుత్వ సీలింగ్ భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం గ్రామ సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ పంగిడిగూడెంలోని 300 ఎకరాల సీలింగ్ భూములను పేదలు సాగు చేసినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ భూములు పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అందుగుల ప్రభాకరరావు, ఎం.బాలరాజు, ఎం.అశోక్ కుమార్, ఎం.సూర్యచంద్రం, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరానికి (2025-26) జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో తొలివిడత ప్రవేశాలకు బుధవారం ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ పి.రజిత నోటిఫికేషన్ జారీచేశారు.విద్యార్థులు నేరుగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలన్నారు. అనంతరం దరఖాస్తు కాపీ ప్రింటవుట్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో 26వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయినవారుమాత్రమే అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అర్హులవుతారన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్ చేసేటప్పుడు ఎలాంటి తప్పులూ దొర్లకుండా చూసుకోవాలని, లేదంటే అడ్మిషన్ పొందేందుకు అనర్హులవుతారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో మొత్తం 804 సీట్లు, ప్రైవేటు ఐటీఐలలో 1672 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.

సెలవుల్లో టీచర్లపై నిర్బంధం తగదు : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బోధించేందుకు ఉపాధ్యాయులు విధిగా పాఠశాలలకు హాజరుకావాలని ఆదేశిస్తూ విద్యాశాఖ మౌఖిక ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు రామారావు, రెడ్డిదొర ఆక్షేపించారు. వేసవి సెలవుల్లో టీచర్లను హాజరుకావాలంటూ నిర్బంధించడం తగదన్నారు. మిగతా శాఖల్లాగే విద్యా శాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి, రెమిడియల్ క్లాసులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు 30రోజుల సంపాదిత సెలవు (ఈఎల్స్)లను మంజూరు చేయాలని లేనిపక్షంలో మౌఖిక ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కర్రసాములో బాలికలకు శిక్షణ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక శాంతినగర్ తొమ్మిదో రోడ్లో కర్రసాము శిక్షణ శిబిరాన్ని ఏలూరు జిల్లా క్రీడాభివృద్ధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ స్వీయ రక్షణకు కర్రసాము ఉపయోగపడుతుందని అన్నారు. సభ్యులు ఒబిలినేని శ్రావణ్ కుమార్ గుప్త మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలకు ఆత్మరక్షణతో పాటు శారీరక ధృఢత్వం కోసం కర్ర సాము శిక్షకులు చిన్న వెంకన్న పర్యవేక్షణలో 30 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంట ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్‌పై హర్షం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) :దశాబ్దాలుగా బలహీన వర్గాలు కోరుకుంటున్న కుల గణన, సమగ్ర జనాభా సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో కులాల వారీగా ఎవరి వాటా ఎంత అనేది తేల్చాలని కుల గణనకోసం ఉద్యమించినట్లు శేషు తెలిపారు. ప్రధాని మోదీ కులగణనపై చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కూటమిలో కీలక నేతగా ఉన్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే బీసీ నేత పాకా సత్యనారాయణకు రాష్ట్రం నుంచి బీజేపీ రాజ్యసభకు పంపడం హర్షణీయమన్నారు.

మూడో రోజుకు సీహెచ్‌వోల నిరసన

ఏలూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని ఏలూరు జిల్లా ఏపీఎంసీఏ అధ్యక్షుడు సొంగా సిద్ధయ్య అన్నారు. కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరసన బుధవారం మూడో రోజుకు చేరింది. రెండేళ్లుగా జీతభత్యాలపై వినతిపత్రాలిస్తున్నా సమస్య పరిష్కరించడం లేదని సీహెచ్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం కింద ఆరేళ్ళుగా సీహెచ్ఏలు పనిచేస్తున్న జీతంలో ఎలాంటి పురోగతి లేదన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల పాల్గొన్నారు. ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ హజరై ఆందోళనకు మద్దతు తెలియజేశారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : అప్పలనాయుడు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : కార్మికులు తమ శ్రమను దారపోస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములుగా ఉన్నారని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. అభివృద్ధిలో భాగమైన కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం మేడే సందర్భంగా కార్మిక, శ్రామిక, కర్షక లోకానికి రెడ్డి అప్పలనాయుడు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు సంక్షేమంతో మరింత వర్ధిల్లినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమల్లో తీసుకొచ్చి ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచిందన్నారు.

మోదీ సభకు వెళ్లేందుకు నేతలు సన్నద్ధం

కామవరపుకోట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ 2వ తేదీన అమరావతికి రానున్న నేపథ్యంలో మండలం నుంచి భారీగా తరలివెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధమవు తున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామ కృష్ణ, టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో 6 బస్సులు, 50 కార్లలో దాదాపు 600 మంది బయల్దేరుతున్నారని తెలిపారు. తడికలపూడి, గుంటుపల్లి, కళ్లచెరువు, రావికంపాడు, కామవరపుకోట నుంచి తరలివెళ్లనున్నట్టు చెప్పారు.

మంత్రి ఆదేశాలతో తాగునీటి సమస్య పరిష్కారం


ట్యాంకర్‌తో తాగునీరందిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్ ఏజెన్సీ పర్యటనలో భాగంగా పులిరాముడుగూడెం వెళ్లగా అక్కడ గిరిజనులు మంచి నీటి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటి అందించాలని మంత్రి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంత్రి చొరవతో పి.ఆర్.గూడెం గిరిజనులకు ట్యాంకర్‌తో మంచి నీటి సరఫరా ప్రారంభించారు. అలాగే గ్రామ పంచాయతీ ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ. 2.50 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించిన మంత్రికి గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

నీటి గండం తప్పింది..

ఎమ్మెల్యే చంటి ముందు జాగ్రత్తతో అప్రమత్తం
అదనపు మోటార్లతో నీటి తోడకం వేగవంతం
చెరువు నిండటంతో తీరిన తాగునీటి సమస్య


సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ చెరువు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు వేసవిలో రెండు పూటలా తాగు నీరందించేందుకు నగర పాలక సంస్థ అధికారులు తీసుకున్న చర్యలు ఫలించాయి. గోదావరి కాల్వలో నీరు తక్కువగా ప్రవహించడంతో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో నీటిని ఎక్కువగా తోడలేకపోయారు. దీంతో పంటలకు సాగునీరందించడం వల్ల చివరలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీరు తోడలేకపోయారు. దీంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీరు 10మీటర్ల ఎత్తుకు పడిపోయాయి. దీంతో వేసవిలో తాగు నీరందించడం ప్రశ్నార్థకంగా మారింది. పరిస్థితి చేయిదాటిపోతుందని గమనించిన ఎమ్మెల్యే చంటి అసెంబ్లీ సమావేశాల్లో ఆందోళన వ్యక్తం చేశారు. వేసవిలో తాగు నీటి సమస్యను తీర్చాలని స్పీకర్‌కు మొరపెట్టారు. వెంటనే రంగంలోకి దిగిన కలెక్టర్ వెట్రిసెల్వి ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను సమన్వయ పరిచి వేసవిలో తాగు నీటి సమస్యలేకుండా చూడాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు గోదావరి కాల్వకు నీటి ప్రవాహం పెంచేందుకు ప్రయత్నాలు చేస్తుండగా ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి కాల్వలు మూసివేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో రంగంలోకి దిగిన ఎమ్మెల్యే చంటి ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడి మరో వారం పాటు కాలువలు వదిలేందుకు సంప్రదింపులు జరిపారు. ఏప్రిల్ 22వరకు కాల్వలను మూసివేయ కుండా మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అప్రమత్తమైన మేయర్ షేక్ నూర్జహాన్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ రంగంలోకి దిగి 400హెచ్‌పీ మోటార్లు రెండు, 20హెచ్‌పీ మోటార్లు 10, 50హెచ్‌పీ మోటార్లు 3 అదనంగా తెప్పించి గోదావరి కాల్వ నుంచి 24గంటలు శ్రమపడి 10రోజుల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపారు. ఇప్పుడు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులు నీటినిల్వలు 12.6మీటర్లకు చేరింది. ఈ నీరు 40రోజులకు సరిపడ నగర ప్రజలకు రెండుపూటల అందించేందుకు సరిపోతుంది. అంతేకాకుండా మరో తాగు నీటి అందించే పంపుల చెరువులో 12అడుగుల ఎత్తు తాగునీటిని నిల్వ చేశారు. ప్రస్తుతం కృష్ణకాల్వ నుంచి పంపుల చెరువుకునీటి పంపింగ్ చేస్తున్నారు. ఈ నీరు నగర ప్రజలకు పదిరోజుల వరకు సరిపోతుంది.

ఆందోళన వద్దు : కమిషనర్ భానుప్రతాప్



నగర ప్రజలకు రెండుపూటల తాగునీరందించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో సరిపోను నీటిని నిల్వ చేశాం. నగర ప్రజలేవ్వరూ ఆందోళన చెందవద్దు. చెరువు గట్టు లీకేజీలు కూడా మరమ్మతులు చేయించాం. ఇంకా గట్టు పటిష్టం చేయడానికి నిపుణులతో సంప్రదిస్తున్నాం.

ఎలాంటి ప్రమాదమైనా ధైర్యంగా ఎదుర్కోండి

» విద్యార్థినులకు పోలీసుల అవగాహన


సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితులోనైనా భయపడకుండా వెంటనే పోలీస్ సహాయం కోసం 112కు కాల్ చేయాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు సూచించారు. ఏలూరు ఎస్ఆర్ పేటలో ఉన్న ఎస్ఆర్ఐ కాలేజీలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలకు ఎన్నో రక్షణ చట్టాలున్నాయని వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యవసర సహాయం కోసం శక్తియాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రతి ఒక్కరి మొబైల్లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థినులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తూ తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ప్రతిఘటించాలన్నారు.సమస్య ఏర్పడితే 112కు గాని శక్తి యాప్‌ను కాని వినియోగించుకోవాలన్నారు. సైబర్ మోసాల బారినపడ్డ వారు 1130కు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల రక్షణ కోసం 181కు కాల్ చేయాలన్నారు.

పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కరదీపిక ఆవిష్కరణ

ఏలూరుసిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు నాబార్డ్ 2025-26 సంవత్సరానికి రూపొందించిన జిల్లా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆమోదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలసీలను, జాతీయ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని వివిధ శాఖల సమన్వయంతో రూపొందించిన పీఎల్‌పిని బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. నాబార్డు సంభావ్యత రుణ ప్రణాళికలో ప్రాధాన్యతా రంగం కోసం రూ.17,785 కోట్లు అంచనాతో రుణ ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళిక, ఆర్థిక సహాయం, యూనిట్ వ్యయాల స్థాయి, క్షేత్రస్థాయి రుణ ప్రవాహం సరళి, క్షేత్రస్థాయిలో మారుతున్న విధానాలు, ప్రస్తుత మౌలిక సదుపాయాల సూచిక మొదలైన అంశాలను పరిగణలోకి తీసుకుని రూపొందించినట్టు తెలిపారు. ప్రాధాన్యతా రంగం కోసం మొత్తం అంచనా రూ.17,785 కోట్లు కాగా ఇందులో వ్యవసాయ రంగానికి రూ.11,282 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం అంచనాలో 63 శాతం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణం రూ.3,633 కోట్లుగా అంచనా వేశారు. ఎగుమతులు రంగానికి రూ. 147.90 కోట్లు, విద్యారంగానికి రూ.83.70 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు రూ.46.63 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ. 534.64కోట్లు, పునరుత్పాదక శక్తికి రూ.12.70 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ. 1106.09 కోట్లుగా అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం టి.అనిల్‌కాంత్, వ్యవసాయ శాఖ జేడీ హబీబ్‌బాషా, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డీఎం డి.నీలాద్రి, జీఎం డిఐసి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ కె.బాబి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై ఉద్యమం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలను 9రకాల బడులుగా పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి దశలవారీ ఉద్యమ కార్యాచరణను చేపట్టనున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు,రెడ్డిదొర తెలిపారు. ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తిని ఒక్కో పాఠశాలకు ఒక్కొక్కమాదిరిగా నిర్ణయించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను హైస్కూళ్లకు తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన టీడీపీ ఇప్పుడు ఏకంగా 9రకాల పాఠశాలలుగా విభజించడాన్ని ఏపీటీఎఫ్ అంగీకరించబోదన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధించే ఉన్నతపాఠశాలలను అలాగే కొనసాగించాలని డిమాండ్‌చేసారు. జాతీయ విద్యావిధానం, విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు.ఈ అసంబద్ధ వర్గీకరణను నిరసిస్తూ 5వ తేదీ నుంచి అన్ని పాత తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను మంజూరుచేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 3 అంచెల్లో చేపట్టే ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మే 9న జిల్లా కేంద్రంలో ధర్నా, 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా జరుగుతాయన్నారు.

'నాగంపాలెంలో రీసర్వేను ఆపండి'


వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నాగంపాలెం రెవెన్యూ పరిధిలో రీసర్వేను తక్షణమే నిలుపుదల చేయాలని ఏజన్సీ గిరిజన సంఘం తరపున కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్‌కు బుధవారం నాయకులు వినతిపత్రం అందజేశారు. పీసా, ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా గిరిజనులకు భూములపై హక్కులు కల్పించాలని విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. భూమస్యలు పరష్కరించిన తర్వాతనే సర్వే పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంజా రామారావు, సవలం రాంబాబు, దాడి రాముడు, కులుం అబ్బులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించండి

(ఐదో పేజీ తరువాయి)

పంపిస్తాం. అక్కడ మంచినీటి వనరులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

● మా గ్రామంలో చెరువుల్లో నీరు నింపడానికి కొంత సమయం కావాలి. కృష్ణా కాలువ నుంచి నీటి విడుదల సమయాన్ని కొన్ని రోజులు పెంచితే చెరువుల్లో పూర్తిస్థాయిలో నీరు నింపడానికి అవకాశముంది.

- ఘంటసాల సుబ్బరాజు,వడ్డిగూడెం(పెదపాడు)

ఎస్ఈ : మీ సమస్యను ఎస్ఈ ఇరిగేషన్ వారికి తెలియజేస్తాం.

● జల జీవన్‌మిషన్‌లో మంచినీటి పైప్‌లైన్లు వేశారు గాని, ఇంటర్నల్ కనెక్షన్ చేయలేదు. దీనివల్ల ఎప్పటికి ఆ పైప్‌లైన్ల ద్వారా నీరు సరఫరా అవుతుంది.

- సాగర్, తంగెళ్ళమూడి

ఎస్ఈ : ఆ పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

● సత్యసాయి మంచినీటి పథకం నుంచి నెలకి నాలుగు సార్లు నీళ్ల రావడం లేదు. పరిశీలించాలి.

- పుష్ప, రాజానగరం(బుట్టాయగూడెం)

ఎస్ఈ : సత్యసాయి పథకానికి సంబంధించి పైప్‌లైన్లకు లీకేజిలుంటే వెంటనే మరమ్మతులు చేస్తాం. ఆ పథకం ద్వారా సక్రమంగా నీరు అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

లింగపాలెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ఆసన్నగూడెం గ్రామానికి చెందిన యర్రా బ్రహ్మయ్య అనే దివ్యాంగుడికి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లి శ్రీను ఆధ్వర్యంలో ట్రై సైకిల్ అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రహ్మయ్య కాలు కోల్పోవడంతో ట్రై సైకిల్ అందించినట్టు తెలిపారు. బొప్పన రాధమ్మ ఆర్థిక సహకారంతో ఇప్పటి వరకు 182 మందికి ట్రైసైకిళ్లు అందించినట్టు శ్రీను తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు ఎం.శ్రీను, యర్రా శ్రీను, పి.జేమ్స్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ కుబేర వ్రతాలు


వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా బుధవారం సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయం లో ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్ర శర్మ భక్తులతో సామూహికంగా లక్ష్మీ కుబేర వ్రతా లు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయ అర్చకులు కపిల శివశంకర ప్ర సాద్ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఆలయ మేనేజరు ఓలేటి మల్లికార్జునరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీ ఆలయం వద్ద బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ ఇన్‌చార్జి చినబాబు ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించినట్టు చినబాబు తెలిపారు. తొలుత కమిటి అధ్యక్షులు కె.జి.ఎస్.వి.గోపాలకృష్ణ, కమిటి సభ్యులు సాయి పల్లవి రామరాజు, సకలా బత్తుల పోతురాజు, చినబాబు, శ్రీనివాసరావు, ప్రవీణ్ బృందం అమ్మవారి సన్నిధిలో అక్షయ తృతీయ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు.

4 నుంచి దత్త వేంకటేశ్వర స్వామి

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

పోలవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : అఖండ గౌతమీ నదీ తీరాన నిర్మించిన దత్త వేంకటేశ్వర స్వామి ఆలయంలో 4వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు ర్యాలీ చంద్రశేఖర్ తెలిపారు. తిరుమల తిరుపతి నుంచి తీసుకొచ్చిన 8 అడుగుల స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు 4న ఉదయం గోపూజ, 108మంది ముత్తయిదువులతో గోదావరి జలాలతో జలాధివాస కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం, గ్రామ బలిహరణ, సర్వదేవతా హోమాలు ఉంటాయన్నారు. 5 నుంచి 8వ తేదీ వరకు ఆవివాహిత హోమాలు, పూజలు మండపారాధనలు, ప్రత్యేక హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 8వ తేదీ ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామి మంత్ర ఉపాసకులు వేపకాయల వెంకన్నబాబు,శ్రీదేవి దంపతులచే విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని, మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉంగుటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రణాళికలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డ్రెయిన్స్, అగ్రికల్చర్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా హార్టికల్చర్ యూనివర్సిటీ డి.డి. రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా శాఖల మధ్య సమన్వయంపై సమీక్షించారు.

నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బుట్టాయగూడెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : లక్ష్మడుగూడెం పంచాయతీ కుమ్మరగట్టు వద్ద కోటి రూపాయలతో నిర్మిస్తున్న రమా సహిత వీరవెంకట సత్యన్నారాయణ స్వామి నూతన ఆలయం, కల్యాణ మండపం నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించగా ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, ఆలపాటి దుర్గారావు దంపతులు, పెనుగుర్తి సోంబాబు, బేతిన శ్రీనివాస్, యంత్రప్రగడ సురేంద్ర, కొండేపాటి రామకృష్ణ, డి.లక్ష్మీజనార్ధన్, యు.నాగరాజు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పల్లె నిద్రలో భాగంగా గ్రామస్థులతో సీఐ రాజశేఖర్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

లింగపాలెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):యువత మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సీఐ రాజశేఖర్ హితవు పలికారు. లింగపాలెం మండలం యడవల్లిలో ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్నతో కలిసి పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలు, నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామస్థులకు మహిళా భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. గోప్యమైన సమాచారం ఏమైనా ఉంటే ఎస్సీ (95503 51100)కి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టుబోయిన రమేశ్, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగంలో నిలపడమే ఏకైక లక్ష్యమని ఎమ్మెల్యే చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతులు స్వీకరించారు. అధికారులకు ఫోన్ చేసి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 10నెలలో ప్రతీ రోజు ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడి సమస్యలక్కడే తిష్ట వేశాయన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యకు పరిష్కారం చూపుతానన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

పెదవేగి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు ప్రభాకర్‌కు వినతులు అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారత లక్ష్యంగా కృషి చేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందితేనే మహిళా వికాసం సాధ్యపడుతుందన్నారు. డ్వాక్రా రుణాల పరిమితిని పెంచి, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనసాగుతోందని ప్రభాకర్ స్పష్టం చేశారు.

కూలిన చెట్ల తొలగింపు

పోలవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు వర్షానికి పలుచోట్ల రహదారులపై చెట్లు నేలకూలాయి.దీంతో రహదారులు దిగ్బంధమై ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బుధవారం రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి తమ సిబ్బందితో పోలవరం నుంచి కన్నాపురం వెళ్లే మార్గంలో ప్రగడపల్లి సమీపంలో కూలిన భారీ వృక్షాలను తొలగించారు.

భక్తుల మరణం పట్ల దిగ్భ్రాంతి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా సింహాచలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో చందనోత్సవం వేడుకల్లో పాల్గొన్న భక్తులు గోడకూలి మరణించడం పట్ల ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా గోడకూలి భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు.

సీత కుటుంబాన్ని ఆదుకోవాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ఈదురు గాలుల వల్ల నష్టపోయిన నామవరపు సీతను ప్రభుత్వం ఆదుకోవాలని కేవీపీఎస్ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రెడ్డిగణపవరం పంచాయతీ వీరభద్రపురంలో ఆమె చిన్ని పిల్లలతో ఉంటోందని ఇంటిపై రేకులు అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణ సాయం అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు.దక్షిణపు వీధిలోని జారా పహరేశ్వర స్వామి కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీగణపతి, దుర్గామల్లేశ్వర సహిత వెంకటేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగ నిర్వహించారు. ఉత్సవంలో ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబా బులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పార్థసారథి,కార్పొరేటర్ నాయుడు పృథ్వీ శారద, సోము, వెంకట ప్పారావు, సాయి కుమారి దంపతులు పాల్గొన్నారు.

మేడే ఘనంగా నిర్వహించాలి

పెదపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మేడేను పంచాయతీ కార్మికులు ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి.కిశోర్‌లు పిలుపునిచ్చారు. మేడే వేడుకల్లో భాగంగా పెదపాడు మండలం అప్పనవీడు, ఏపూరు పంచాయతీ కార్మికులతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశాలు నిర్వహించారు.శ్రీనివాస డాంగే మాట్లాడుతూ మేడే రోజున కార్మికులంతా జెండాలు ఆవిష్కరించి, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ పత్రిష్ఠ



జీలుగుమిల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాచన్నగూడెంలో గ్రామ దేవత ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ అధ్యక్షులు పులు మోలు శివాజీ, ఎంపీటీసీ నాలి శ్రీను, సర్పంచ్ సున్నం వరలక్ష్మీ, నట్టే నాగరాజు, వనమ వెంకటేశ్వరావులు మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని ముత్యాలమ్మ గుడి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైభవంగా అన్నసమారాధన జరిపారు.


సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

డీవైఈవో రవీంద్రభారతికి ఘనంగా సన్మానం

ఉంగుటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖాధికారిణిగా పనిచేసి ఏలూరు డీవైఈవోగా బదిలీ అయిన నిమ్మగడ్డ రవీంద్రభారతిని బుధవారం యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల విద్యా వనరుల మందిరంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ ఈ మూడేళ్లలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పరసా వెంకట్రావు, యూటీఎఫ్ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాకి జోగినాయుడు, ఉనుముల రాంబాబు, సి.హెచ్.శ్రీధర్, శీతాల సత్యనారాయణ, తూతిక శివయ్య, ఓ.ఆనంద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల నరసింహరావు, అల్లూ శ్రీను, బొమ్మిడి ప్రసాద్ ఉన్నారు.

సమయాన్ని వృథా చేసుకోవద్దు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానం సంపాదించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు జరిగాయి. శిబిరాన్ని పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలు చూసుకుంటూ సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు. సమ్మర్ క్యాంపుకు వచ్చి మంచి కథనాలు, డ్రాయింగ్, జనరల్‌నాలెడ్జ్ లెక్కల్లో విజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. సీనియర్ విద్యార్థి శేషారత్నం విద్యార్థులకునీతికథలు బోధించారు. రిసోర్స్ పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ నేర్పించారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులకు గాయాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి - కైకలూరు రహదారిలో పెయ్యేరు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముదినేపల్లి ఎంఆర్‌సి కార్యాలయ ఉద్యోగులు రవి, సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. వారు ద్విచక్ర వాహనంపై ముదినేపల్లి వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొంది. సందీప్‌కు తీవ్ర గాయాలు కాగా, రవి కాలు మడమ వద్ద ఎముక విరిగింది. స్థానికులు వెంటనే 108 వాహనంలో వారిని గుడివాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

కాళీమాత విగ్రహ పునఃప్రతిష్ఠ



కైకలూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కైకలూరు కోరుకొల్లు రోడ్డులో కాళీమాత ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ బుధవారం నిర్వహించారు. అర్చకులు ముట్నూరి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన జరిపారు.

మంచినీటి సమస్యలు పరిష్కరించండి

(ఐదో పేజీ తరువాయి)

పంపిస్తాం. అక్కడ మంచినీటి వనరులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- మా గ్రామంలో చెరువుల్లో నీరు నింపడానికి కొంత సమయం కావాలి. కృష్ణా కాలువ నుంచి నీటి విడుదల సమయాన్ని కొన్ని రోజులు పెంచితే చెరువుల్లో పూర్తిస్థాయిలో నీరు నింపడానికి అవకాశం ఏర్పడుతుంది.

- ఘంటసాల సుబ్బరాజు, వడ్డిగూడెం, పెదపాడు మండలం.

ఎస్ఈ : మీ సమస్యను ఎస్ఈ ఇరిగేషన్ వారికి తెలియజేస్తాం.

- జల జీవన్‌మిషన్‌లో మంచినీటి పైప్‌లైన్లు వేశారు గాని , ఇంటర్నల్ కనెక్షన్ చేయలేదు. దీనివల్ల ఎప్పటికి ఆ పైప్‌లైన్ల ద్వారా మంచినీరు సరఫరా అవుతుంది.

- సాగర్, తంగెళ్ళమూడి

ఎస్ఈ : ఆ పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- సత్యసాయి మంచినీటి పథకం నుంచి నెలకి నాలుగు సార్లు నీళ్ల రావడం లేదు. పరిశీలించాలి.

- పుష్ప, రాజానగరం, బుట్టాయిగూడెం మండలం.

ఎస్ఈ : సత్యసాయి పథకానికి సంబంధించి పైప్‌లైన్లకు లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేస్తాం. ఆ పథకం ద్వారా సక్రమంగా నీరు అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

తాగునీటిని చేపల చెరువులకు తోడితే చర్యలు

» ఇరిగేషన్ డీఈఈ శిరీష



పెదలంక తాగునీటిని పరిశీలిస్తున్న డీఈఈ శిరీష, డీసీ చైర్మన్ భోగేశ్వరరావు

[illegible] తాగునీటిని [illegible] నీటి చెరువులకు వెళుతున్న నీటిని [illegible] ఇరిగేషన్ డీఈఈ శిరీష హెచ్చరించారు. [illegible] నీటిని [illegible] సెట్లు, ఆయిల్ ఇంజన్లను తొలగించాలన్నారు. సీబీ [illegible] నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



లక్ష కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమ పూజ

కైకలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయను పురస్కరించుకుని శ్యామలాంబ ఆలయంలో బుధవారం లక్ష కుంకుమ పూజలు నిర్వహించారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛ రణల మధ్య పూజలు చేశారు. లక్ష్మీ కుబేర పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్యామలాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో వీఎన్‌కె.శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ముదినేపల్లి గ్రంథాలయంలో వాచకాల పఠనం చేస్తున్న విద్యార్థులు



కోరుకొల్లులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

కైకలూరు/ముదినేపల్లి/కలిదిండి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కైకలూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను బుధవారం ప్రారంభించారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ముదినేపల్లి గ్రంథాలయంలో విద్యార్థులు వాచకాల పఠనం నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులు వేమన శతకాలు, జాతీయ నాయకుల చరిత్రలు ఉన్న పుస్తకాలను పఠించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. కోరుకొల్లు, కలిదిండి గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం, వార్తా పత్రికలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని, పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయాధికారులు రాఘవులు, రమేష్ బాబు సూచించారు. రిటైర్డ్ ఈవో జార్జిరావు, సీహెచ్.సాయిరామ్ పాల్గొన్నారు.



కైకలూరు గ్రంథాలయంలో విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు



జగన్నాథస్వామి దేవస్థానంలో రాట ప్రతిష్ఠ పూజలు

జగన్నాథస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వడాలి జగన్నాథ స్వామి ఆలయంలో మే 10 నుంచి జరుగనున్న వార్షిక కల్యాణో త్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద బుధవారం రాట ప్రతిష్ఠ (స్తంభ పూజ) కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసుల వెంకట ఫణి కుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, వీరమల్లు నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

4న గురజలో విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గురజ గ్రామంలో నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మే 4న జరగ నుంది. ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేస్తున్నది. మే 2న విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, వాస్తు పూజ, హోమ కార్య క్రమాలు, 3న స్వామివార్లకు పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, స్వామివార్ల ఊరేగింపు, మహాశాంతి హోమం, 4న సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్య క్రమాలు జరుగుతాయి. అనంతరం శాంతి కల్యాణం, అన్న సమారాధన నిర్వహిస్తారు.



గురజలో నిర్మించిన శ్రీ సీతారామాలయం

నేటి నుంచి లూర్దుమాత ఉత్సవాలు



మండవల్లి, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): భైరవ పట్నం విచారణ సంఘం నిర్వ హించే లూర్దుమాత ఉత్స వాలు గురువారం నుంచి ప్రారంభం కాను న్నాయి. మే 3 వరకు ఉత్సవాల నిర్వహణకు మందిర కమిటీ ప్రత్యేక చర్యలు చేపడు తోంది. 1939లో భైరవపట్నం విచారణ సంఘం ఆధ్వర్యంలో మొదటిసారిగా ఈ ప్రాంతంలో క్రైస్తవ పరిచర్య ప్రారంభమైంది. ప్రస్తుతం భైరవపట్నం విచారణ సంఘం ఆధ్వర్యంలో 14 గ్రామా ల్లో సేవలందిస్తున్నారు. ఉత్సవాలకు విజయవాడ అధికారి జోసెఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు భైరవపట్నం విచారణ సంఘం గురువు శాంతరాజు తెలిపారు. చర్చి నుంచి రోడ్డు వరకు ప్రత్యేక లైటింగ్, మంచినీటి చెరువులో మరియమ్మ లైటింగ్ ఆకట్టుకుంటున్నాయి.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కైకలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై వి.రాంబాబు బుధవారం తెలిపారు. పందిరిపల్లిగూడెం గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఏప్రిల్ 29 నుంచి కనిపించడం లేదు. ఉదయం తల్లి చేపల వేటకు వెళ్లగా సోదరితో ఇంట్లో ఉన్న బాలిక అదృశ్యమైంది. తల్లి సాయంత్రం వచ్చే సరికి బాలిక కనిపించకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెల్లిని తీసుకొస్తూ అన్నయ్య మృతి



ఏసు బాబు మృతదేహం

నూజివీడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులి వ్వడంతో చెల్లిని తీసుకుని బైక్‌పై వస్తున్న అన్నయ్య రోడ్డు ప్రమా దంలో మృతి చెందిన ఘటన నూజివీడు మండలం బత్తులవారి గూడెంలో జరిగింది. ఏలూరు జిల్లా పెదపాడు మండలం పాతముప్పర్రు గ్రామానికి చెందిన ఏసు బాబు(39) తన చిన్నాన్న కుమార్తె షైల వరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీ-ఫార్మసీ చదువుతోంది. ఆమెకు సెలవులివ్వడంతో తీసుకొచ్చేందుకు బుధవారం ద్విచక్రవా హనంపై షైలవరం వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో బత్తులవారి గూడెం వద్ద బొలేరో వాహనం ఢీకొని ఇద్దరూ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఏసుబాబు స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏసు బాబుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి చెరువులో పశువుల జలకాలాట



వెంకటాపురంలో తాగునీటి చెరువులో పశువులు

కలిదిండి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం తాగునీటి చెరువులో పశువులు జలకాలాడుతున్నాయి. తాగునీరు కలుషితమవుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీరోజు చెరువులో పశువులు దిగడంతో నీరు రంగుమారి దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. పశువులను మంచినీటి చెరువు గట్టుపై కట్టడంతో పేడ, మూత్రం చెరువులో కలుస్తున్నాయని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పశువులు తాగునీటి చెరువులో దిగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సీతారామ్‌ను వివరణ కోరగా, తాగునీటి చెరువులోకి పశువులు దిగకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు గట్టుపై పశువులను కడుతున్న వారికి నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రధాని మోదీ సభకు భారీ జనసమీకరణ

గ్రామాల వారీగా నాయకుల సమీక్షలు



చాట్రాయి సమావేశంలో మాట్లాడుతున్న ఏవో విష్ణు

నూజివీడు/చాట్రాయి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అమరావతిలో రెండో తేదీన జరిగే ప్రధాన మంత్రి భారీ బహిరంగ సభకు నూజివీడు నుంచి భారీ జనసమీకరణ జరుగుతోంది. మంత్రి నియోజకవర్గం కావడంతో జనసమీకరణపై మంత్రి పార్థసారథి దృష్టి పెట్టారు. నియోజకవర్గంలోని నూజివీడు టౌన్, రూరల్, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల నుంచి నాలుగో తేదీ ఉదయం 7 గంటలకు బస్సుల ద్వారా జనాలను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రతి రెండుగ్రామాలకు ఒక బస్సు చొప్పున కేటాయించారు. నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులతో మంత్రి ఫోన్‌ల ద్వారా చర్చ జరిపి జనసమీకరణలో అలసత్వం వద్దని బస్సుల్లో వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. చాట్రాయి మండలంలో ప్రధాని మోదీ సభకు మండలం నుంచి బస్సులలో జనం తరలింపుపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఏవో విష్ణు సమీక్ష నిర్వహించారు. మండలానికి 15 బస్సులు కేటాయించారని, ప్రతి బస్సుకి ఇన్‌చార్జిలుగా నియమితులైన ఉద్యోగులు, ఆసక్తి ఉన్న పలు వర్గాల ప్రజలను బస్సులలో సభకు తీసుకువెళ్లాలన్నారు. సభకు తీసుకువెళ్లి తిరిగి వారి గ్రామాలకు చేరే వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమన్వయ కర్తలుగా వ్యవహరించాలని కోరారు.

కేంద్ర వైఫల్యం వల్లే కశ్మీర్ దుర్ఘటన

చాట్రాయి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదులు 26మంది అమాయకులను కాల్చి చంపిన దుర్ఘటనకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఫల్యమే కారణమని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారురావు విమర్శించారు. మర్రిబంధం గ్రామంలో బుధవారం జరిగిన లిబరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులు ఆయుధాలతో సహా జన సమూహంలోకి వచ్చి కాల్పులకు తెగబడడం కేంద్ర ప్రభుత్వం, గూఢచారి వ్యవస్థలం వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దు చేయటం ద్వారా కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడిందని మోదీ, అమిత్‌షా మాటల్లో నిజం లేదని తేలిపోయిందన్నారు. కశ్మీర్ దుశ్చర్యను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్, నాయకులు దుర్గం పుల్లారావు, వేముల బక్కయ్య, చాట్ల బాబూరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న లిబరేషన్ రాష్ట్ర నేత బంగారావు, కార్యకర్తలు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జనార్దనవరంలో బుధవారం జరిపిన దాడిలో 400 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసి బెజవాడ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశామని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు తెలిపారు. అతడి వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో ఈఎస్‌టీఎఫ్ ఎస్ఐ ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీగా వాకా రాజ్‌కుమార్



నూజివీడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నూజివీడు అదనపు కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, నూజివీడు బార్ అసోసి యేషన్ మాజీ అధ్యక్షుడు వాకా రాజ్‌కుమార్ నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ సభ్యుడిగా ఉన్నారు. నూజివీడు తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం నుంచి లీగల్ వ్యవహారాల్లో పార్టీకి అండగా ఉంటూ సేవలందించారు. ఏపీపీగా నియమించబడ్డ రాజ్ కుమార్‌ను బుధవారం పలువురు న్యాయ వాదులు, రాజకీయ నాయకులు, పురప్రముఖులు అభినందించారు.



సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

ఎలాంటి ప్రమాదమైనా ధైర్యంగా ఎదుర్కోండి

» విద్యార్థినులకు పోలీసుల అవగాహన

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లోనైనా భయపడకుండా వెంటనే పోలీస్ సహాయం కోసం 112కు కాల్ చేయాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ ఎం.సుబ్బారావు సూచించారు. ఏలూరు ఎన్ఆర్ పేటలో ఉన్న ఎన్ఆర్ఐ కాలేజీలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలకు ఎన్నో రక్షణ చట్టాలున్నాయని వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యవసర సహాయం కోసం శక్తియాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రతి ఒక్కరి మొబైల్లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థినులు క్రమ శిక్ష ణతో విద్యను అభ్యసిస్తూ తమకు ఎదురయ్యే సమస్య లను ధైర్యంగా ప్రతిఘటించాలన్నారు.సమస్య ఏర్పడితే 112కు గాని శక్తి యాప్‌ను కాని వినియోగించుకోవా లన్నారు. సైబర్ మోసాల బారినపడ్డ వారు 1130కు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల రక్షణ కోసం 181కు కాల్ చేయాలన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరానికి (2025-26) జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో తొలివిడత ప్రవేశాలకు బుధవారం ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ పి.రజిత నోటిఫికేషన్ జారీచేశారు. విద్యార్థులు నేరుగా ఐటీఐ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించా లన్నారు. అనంతరం దరఖాస్తు కాపీ ప్రింటవుట్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో 26వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయినవారు మాత్రమే అడ్మిషన్ల కౌన్సె లింగ్‌కు హాజరయ్యేందుకు అర్హులవుతారన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్ చేసే టప్పుడు ఎలాంటి తప్పులూ దొర్లకుండా చూసుకోవాలని, లేదంటే అడ్మిషన్ పొందేందుకు అనర్హులవుతారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో మొత్తం 804 సీట్లు, ప్రైవేటు ఐటీఐలలో 1672 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812- 230269లో సంప్రదించాలని కోరారు.



సూరేపల్లిలో కూలీలకు సూచనలిస్తున్న ఏపీవో రోజ్‌లీల

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి

ముసునూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఏపీవో రోజ్‌లీల అన్నారు. బుధవారం సూరేపల్లి, చెక్కపల్లి, రమణక్కపేట, ముసునూరు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. మస్టర్ రికార్డులు, కూలీలు చేస్తున్న పనులను ఆమె పరిశీ లించి మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనులకు వచ్చి ప్రభుత్వం అంది స్తున్న ఆర్థిక సాయాన్ని పొందాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయానే పనులకు కూలీలు వెళ్లి మార్కింగ్ ప్రకారం పనులు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేయకపోతే వేతనాలు చెల్లింపులు నిలిపివేస్తామన్నారు. కూలీల మస్టర్లు, పనుల ప్రోగ్రెస్, ఇతర వివరాలను సైతం ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి ఏపీవో సూచించారు.

సింహాచలంలో భక్తుల మరణం పట్ల ఎంపీ దిగ్భ్రాంతి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా సింహాచలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో చందనోత్సవం వేడుకల్లో పాల్గొన్న భక్తులు గోడకూలి మరణించడం పట్ల ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చే శారు. భారీ వర్షాల కారణంగా గోడకూలి భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా లక్ష్మీకుమారి బాధ్యతలు



ముసునూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా లక్ష్మీకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన కె.ప్రవీణ నిమ్మకూరు రెసిడెన్షియల్ కాలేజ్‌కి బదిలీపై వెళ్లారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న లక్ష్మీకుమారి డిప్యూటేషన్‌పై ముసునూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వచ్చారు. నూతన ప్రిన్సిపాల్‌కు ఎస్ఎంసీ చైర్మన్ సాయిల పంగిడియ్య, వైస్ చైర్మన్ కందేపు రాధిక, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలు తెలిపారు.

నూజివీడులో ప్రశాంతంగా ముగిసిన 'పాలిసెట్' పరీక్ష



నూజివీడులో పోలిసెట్ పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

నూజివీడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నూజివీడులో బుధవారం పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ ఎంట్రన్స్ పరీక్షను అబ్జర్వర్ సంజీవరావు, కో-ఆర్డినేటర్ కృష్ణమోహన్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రాజు పరిశీలించారు. అనంతరం వీరు మాట్లాడుతూ 770మంది విద్యార్థులకు గాను 699మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. మొదటిసారి నూజివీడులో పాలిసెట్ పరీక్షను నిర్వహించారని, రానున్న విద్యాసంవత్సరంలో మరిన్ని సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. జడ్పీ గర్ల్స్ హైస్కూల్, ఎస్.ఆర్.ఆర్ జడ్పీ బాలుర హైస్కూల్, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేసుకోవద్దు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానం సంపాదించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు జరిగాయి. శిబిరాన్ని పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలు చూసుకుంటూ సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. సమ్మర్ క్యాంపుకు వచ్చి మంచి కథనాలు, డ్రాయింగ్, జనరల్‌నాలెడ్జ్ లెక్కల్లో విజ్ఞానాన్ని సంపాదిం చుకోవాలన్నారు. సీనియర్ విద్యార్థి శేషారత్నం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. రిసోర్స్ పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ నేర్పించారు.